Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 171 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 12 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం.. కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసి, సభను తప్పుదారి పట్టించిన విపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వనున్నట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై బడ్జెట్ చర్చలో రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. వీటిని మంత్రి రిజిజు తోసిపుచ్చారు. రాహుల్ గాంధీ బడ్జెట్ ప్రసంగాన్ని కిరణ్ రిజిజు ప్రస్తావిస్తూ.. 'రాహుల్ గాంధీ సభను తప్పుదారి పట్టించారు. నిరాధార ఆరోపణలు చేశారు. దీనిపై మేము సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం. ఉభయసభల్లోనూ సభా కార్యక్రమాల నిర్వహణకు స్పష్టమైన నియమ, నింబంధనలు ఉన్నాయి. ఒక సభ్యుడు మరో సభ్యుడిపై తీవ్ర ఆరోపణలు చేయాలనుకుంటే నోటీసు ఇవ్వాలి, ఆరోపణలను రుజువు చేయాలి' అని అన్నారు. తన వాదనలను నిరూపించే ఆధారలతో సభకు రావాల్సిందిగా రాహుల్‌కు సూచించాలని సభాపతికి తాను కోరనున్నట్టు చెప్పారు.

**ఏ ఆధారంతో ఆ మాటలు అంటారు?**

ప్రధానిపైన, ప్రభుత్వంపైన రాహుల్ నిరాధార ఆరోపణలు చేశారని రిజిజు చెప్పారు. 'ప్రధానమంత్రి దేశాన్ని, దేశ ప్రయోజనాలను అమ్మేశారని ఆయన చెబుతున్నారు. దీనికి ఆధారాలున్నాయా? ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీపై కూడా రాహుల్ తీవ్రమైన ఆరోపణలు చేశారు' అని రిజిజు చెప్పారు. ఎలాంటి సాక్ష్యాలు, విధానపరమైన నోటీసులు లేకుండా రాహుల్ ఈ ఆరోపణలు చేశారని, ఆయన చేసిన తప్పుడు ఆరోపణలు, అమర్యాదకర వ్యాఖ్యలతో సహా ఆయన ప్రసంగం మొత్తాన్ని రికార్డుల నుంచి తొలగించాలని, ముఖ్యంగా ఆయన చెప్పిన అబద్ధాలు, నిరాధార ఆరోపణలను తొలగించాలని అన్నారు.

**ఎవరూ దేశాన్ని అమ్మలేరు..**

దేశాన్ని అమ్మేశారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రిజిజు మండిపడ్డారు. ఏ ఒక్కరూ దేశాన్ని అమ్మడం కానీ, కొనడం కానీ చేయలేరని అన్నారు. కనీసం ఊహించడం కూడా సాధ్యం కాదని అన్నారు.

**రాహుల్ ఏమన్నారంటే..**

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ద్వారా 'భరతమాతను అమ్మేశారు' అని రాహుల్ తన ప్రసంగంలో ప్రభుత్వంపై తీవ్రారోపణలు చేశారు. ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాలపై రాజీ పడ్డారని, గుత్తగా లొంగిపోయారని విమర్శించారు. అదే కనుక 'ఇండియా' కూటమి ప్రభుత్వం ట్రేడ్‌డీల్‌పై సంప్రదింపులు జరిపి ఉంటే ఇండియాను సమాన భాగస్వామిగా గుర్తించాలని అమెరికాకు గట్టిగా చెప్పి ఉండేవాళ్లమని అన్నారు. 'మీరు ఇండియాను అమ్మేశారు. ఇది సిగ్గుగా అనిపించడం లేదా? మీరు మన తల్లి భరతమాతను అమ్మేశారు' అంటూ తీవ్ర విమర్శలు చేశారు. భారతదేశ ఇంధన భద్రత ఇప్పుడు బలహీనమైందని, అమెరికా నిర్ణయాలపై ఆధారపడి చమురు కొనాల్సి వస్తుందని అన్నారు. రైతుల ప్రయోజనాలపై కేంద్రం రాజీ పడిందని, ఇప్పుడు దేశీయ మార్గెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు వరదలా వచ్చిపడతాయని చెప్పారు. టెక్స్‌టైల్ పరిశ్రమపై ఇప్పటికే తీవ్ర ప్రభావం పడిందని, ప్రస్తుత విధానాలతో ఆ రంగం పూర్తిగా ఫినిష్ అయినట్టేనని అన్నారు. యుద్ధాల శకం ముగిసిందని ప్రధానమంత్రి మోదీ, ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నిరంతర ఘర్షణలే నేటి ప్రపంచ వాస్తవం అని అన్నారు.

## దేవుడంటే విశ్వాసం లేదు.. జగన్ అండ్ కో పై సీఎం చంద్రబాబు ధ్వజం




**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత జగన్‌పై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క తిరుపతిలోనే కాదని.. అన్ని దేవాలయాల్లోనూ జగన్ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని స్పష్టం చేశారు. అన్ని మతాల సెంటిమెంట్లు ముఖ్యమన్న విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. వైసీపీ హయాంలో రామతీర్థంలో రాముడి తల నరికారని ఆగ్రహించారు. అసెంబ్లీకి అందరూ రావాల్సిందే.. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అసెంబ్లీ సమావేశాలకు ప్రతి ఒక్కరూ ఉదయం 9:00 గంటలకు అందరూ హాజరు కావాల్సిందే. ఉదయం 9:00 గంటల నుంచి 10:00 గంటల వరకే ప్రశ్నోత్తరాలు ఉంటాయి. నేను ప్రతి ఒక్కటీ గమనిస్తూనే ఉన్నా.. కూటమి పక్షాల అధినేతలుగా ఉన్న మా మధ్య ఎలాంటి విభేదాలూ లేవు. మేమంతా ఐక్యతగా ఉన్నాం. అభివృద్ధే మా లక్ష్యం. 40 మంది టీడీపీ ఎమ్మెల్యే లను పిలిపించుకుని వారితో మాట్లాడి, వారి పనితీరును సమీక్షిస్తాం. మేం పరిష్కరించాల్సిన సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండి' అని చెప్పారు.

**ప్రజలకు జవాబుదారీగా ఉండాలి..**

టీడీపీ నేతలు ఇష్టం వచ్చినట్లు నోరుజారి మాటాడవద్దు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. 'మనం 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ప్రతి రోజు అందరూ అసెంబ్లీకు రావాల్సిందే. గవర్నర్ ప్రసంగం నేను రెండున్నర గంటలు స్టడీ చేశాను. ఇప్పటివరకు మనం చేసిన అభివృద్ధి పనుల గురించి చర్చించాల్సిన అవసరముంది. జాతీయ రహదారులు మన రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయి. రైల్వేకు సంబంధించి రూ.90 వేల కోట్ల పనులు సాగుతున్నాయి. మీ నియోజకవర్గాలకు సంబంధించిన పనులేమైనా ఉంటే నా దృష్టికి తీసుకురండి. కేంద్ర ప్రభుత్వం.. మన రాష్ట్రం పట్ల చాలా పాజిటివ్‌గా ఉంది. విశాఖ స్టీల్ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.450 కోట్లు నష్టంలో ఉంది. కానీ ఈ ఏడాది ఆ నష్టాన్ని పూరించి రూ.50 కోట్ల లాభంలోకి వచ్చింది' అని అన్నారు.

## డాక్టర్ పూర్ణ రాజేశ్వరికి ఆయుర్వేద నారీ శక్తి అవార్డు ప్రదానం




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్ ఆయుర్వేద నాన్-సర్జికల్ స్పెషలిస్ట్ డాక్టర్ పూర్ణ రాజేశ్వరికి, 07.02.2026న వైజాగ్‌లో జరిగిన WAPCON కార్యక్రమంలో ఆయుర్వేద నారీ శక్తి అవార్డును విశ్వ ఆయుర్వేదిక్ పరిషత్ వారు ప్రదానం చేశారు. డాక్టర్ పూర్ణ రాజేశ్వరి కృష్ణా జిల్లాలోని మంటాడా గ్రామానికి చెందినవారు. ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ నిపుణుడు, ఆమె గురువు అయిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడు కూడా ఇదే గ్రామానికి చెందినవారు. "క్యాన్సర్‌ను ఎలా నివారించాలి, క్యాన్సర్‌కు కారణాలు ఏమిటి" అనే అంశంపై ఒక పుస్తకం రాయడానికి ఆయన డాక్టర్ పూర్ణ రాజేశ్వరిని ప్రోత్సహించారు.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం (ఫిబ్రవరి 4, 2026) సందర్భంగా ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు.

## వైసీపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి..అసెంబ్లీ సభ్యులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ.. హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ సమావేశానికి మూడు పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. వైసీపీ నేతలు చేసే విధ్వంస కుట్రలను సమావేశంలో డిప్యూటీ సీఎం లేవనెత్తారు. మన ప్రభుత్వంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మూడు పార్టీల సభ్యులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని పవన్ దిశానిర్దేశం చేశారు.


**సభ్యులు కీలక అంశాలు ప్రస్తావించాలి: మంత్రి పయ్యావుల కేశవ్**

ఏపీ అసెంబ్లీలో సభ్యులు ఎంతసేపు మాట్లాడామనే దానికంటే గురించి ఏం మాట్లాడమనేది ముఖ్యమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలువురు పారిశ్రామికవేత్తలను కలిశారని ప్రస్తావించారు. ఆయన కలిసే ప్రతీ సంస్థ గురించి ముందస్తు సమాచారం సేకరించి ముఖ్యమైన అంశాల గురించి మాట్లాడేవారని గుర్తు చేశారు. దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలతో జరిగిన భేటీలో ఆ సంస్థకు మన ప్రభుత్వ పరంగా కావాల్సినవి ఏమిటి? మనకు ఉన్న వనరులేమిటనే విషయంపై సూటిగా చెప్పి.. ప్రతి సమావేశాన్ని నిమిషాల వ్యవధిలో చంద్రబాబు ముగించారని ప్రస్తావించారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను కలిసేందుకు వీలైందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో సభ్యులు కూడా ముఖ్యమంత్రి స్ఫూర్తితో.. తక్కువ సమయంలో కీలక అంశాల గురించి ప్రస్తావించాలని మంత్రి పయ్యావుల కేశవ్ మార్గనిర్దేశం చేశారు.



ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా, 04.02.2026న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా డాక్టర్ పూర్ణ రాజేశ్వరి రచించిన 'క్యాన్సర్‌ను ఎలా నివారించాలి, క్యాన్సర్‌కు కారణమయ్యే కారకాలు' అనే పుస్తకం ఆవిష్కరణ.

## మార్చి 7వరకు అసెంబ్లీ సమావేశాలు.. పలు అంశాలపై చర్చ




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ( కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి నెల 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది. 19వ తేదీ నుంచి 8 పనిదినాలు, డిమాండ్ల గ్రాంట్లపై అసెంబ్లీ బీఏసీ చర్చించనుంది ఈ నెల 28న శనివారం నాడు కూడా అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మార్చి 1, 2, 3వ తేదీల్లో అసెంబ్లీకి సెలవు దినాలుగా నిర్ణయించింది. మార్చి 6, 7న బడ్జెట్‌పై మరోసారి చర్చించనున్నారు. ఆ తర్వాత అవసరం మేరకు అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? వద్దా? అనే విషయమై అసెంబ్లీ బీఏసీ నిర్ణయించనుంది. అసెంబ్లీ సమావేశాల్లో రోజూ జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.

# "స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం - బాండెడ్ లేబర్ వ్యవస్థ నిర్మూలనలో మన బాధ్యత" అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్




**అమరావతి, (రాజధాని వార్తలు):** బాండెడ్ లేబర్ సిస్టమ్ (రద్దు) 1976 చట్టం అమలులోకి వచ్చి 50 సంవత్సరాల పూర్తయిన దృష్ట్యా విఐటి–ఏపి విశ్వవిద్యాలయంలో "స్వేచ్ఛ, సమానత్వం మరియు సామాజిక న్యాయం – బాండెడ్ లేబర్ వ్యవస్థ నిర్మూలనలో మన బాధ్యత" అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహణ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సహకారంతో విఐటి–ఏపి విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 10, 2026న "స్వేచ్ఛ, సమానత్వం మరియు సామాజిక న్యాయం – బాండెడ్ లేబర్ సిస్టమ్ నిర్మూలనలో మన బాధ్యత" అనే అంశంతో ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు, రెవెన్యూ, కార్మిక, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖలోని వివిధ విభాగాలతో పాటు లీగల్ సర్వీస్ అథారిటీ యొక్క పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. మొత్తం వర్క్‌షాప్‌ను 3 సాంకేతిక సెషన్లుగా విభజించారు. APSLSA ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గౌరవనీయ న్యాయమూర్తి సి.హెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ కీలక ఉపన్యాసంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి గౌరవనీయులైన జస్టిస్ ఎ.వి.శేషసాయి మొదటి సెషన్‌కు అధ్యక్షత వహించారు. న్యాయపరమైన పూర్వాపరాలు మరియు 1976 నాటి బాండెడ్ లేబర్ సిస్టమ్ (రద్దు) చట్టం, యొక్క కీలక నిబంధనలను తెలియచేసారు. మొదటి సాంకేతిక సెషన్ ప్యానెల్‌లో డా॥ బెనార్జీ చక్కా, విఐటి–ఎపి స్కూల్ ఆఫ్ లా డీన్, లేబర్ వెల్ఫేర్ బోర్డ్ విజయవాడ సంక్షేమ కమిషనర్ ఎ.గణేషన్ పాల్గొని బాండెడ్ లేబర్ వ్యవస్థ నిర్మూలనలో గణాంకాలు మరియు విజయాలను వివరించారు. రెండవ సాంకేతిక సెషన్‌కు జస్టిస్ డాక్టర్ వి.ఆర్.కె.కృపాసాగర్, ఐ.ఎ.ఎస్., సి.డి.ఆర్. అశోక్ వి.ఎం. కుమార్ (రిటైర్డ్) అధ్యక్షత వహించారు. మూడవ సెషన్‌లో అద్భుతమైన వక్తలుగా బి.లావణ్య వేణి, IAS., డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, జి.నాగమల్లేశ్వరి, ప్రోగ్రామ్ మేనేజర్, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మరియు బి.ఎస్.వి. హిమాబిందు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్ బాండెడ్ లేబర్ వ్యవస్థను నిర్మూలించడంలో ప్రతి వ్యక్తి బాధ్యతను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. విభాగాల మధ్య చర్చలు, భాగస్వామ్య అనుభవాలు మరియు సమిష్టి సంభాషణ ప్రక్రియ మరియు అవగాహనను బలోపేతం చేసింది, అదే సమయంలో స్వేచ్ఛ, సమానత్వం మరియు సామాజిక న్యాయం యొక్క విలువలను కూడా పరిగణనలోకి తీసుకుంది. చట్టపరమైన మరియు న్యాయపరమైన ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఆచరణాత్మక అమలుకు అనువదించడంతో, బలహీన వర్గాలకు స్వేచ్ఛ, గౌరవం మరియు న్యాయాన్ని నిర్ధారిస్తూ ఈ కార్యక్రమం ముగిసింది.

# విఐటి-ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28 నుండి 2026 మే 3 వరకు నిర్వహణ

**అమరావతి, (రాజధాని వార్తలు):** వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గ్రూప్ సంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం విఐటి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష 2026ను నిర్వహించనుంది. ఈ పరీక్ష భారతదేశంలో మరియు విదేశాలలో నిర్దేశిత పరీక్షా కేంద్రాలలో ఏప్రిల్ 28 నుండి మే 3, 2026 మధ్య నిర్వహించబడుతుంది మరియు దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 31, 2026గా నిర్ణయించబండింది. VITEEE 2026 కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించబడుతుంది. పరీక్షా సమయం 2 గంటల 30 నిమిషాలు ఉంటుంది మరియు అభ్యర్థులు ఒక్కసారి మాత్రమే పరీక్షకు హాజరు కావడానికి అనుమతించబడతారు. ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే దరఖాస్తు మరియు ప్రవేశం రద్దు చేయబడతాయి. ప్రశ్నపత్రంలో పూర్తిగా బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి మరియు ఇది కేవలం ఆంగ్లంలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. పరీక్షా విధానం ఈ క్రింది విధంగా ఉంటుంది. గణితం/జీవశాస్త్రం: 40 ప్రశ్నలు. భౌతికశాస్త్రం: 35 ప్రశ్నలు. రసాయనశాస్త్రం: 35 ప్రశ్నలు. ఆప్టిట్యూడ్: 10 ప్రశ్నలు. ఆంగ్లం: 5 ప్రశ్నలు. ప్రశ్నాపత్రంలో మొత్తం 125 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తీసివేయబడుతుంది మరియు సమాధానం ఇవ్వని లేదా సమీక్ష కోసం గుర్తించిన ప్రశ్నలకు ఎలాంటి మార్కులు ఇవ్వబడవు లేదా తీసివేయబడవు.

ఎంపిక మరియు కౌన్సెలింగ్ ప్రక్రియ

అభ్యర్థుల ఎంపిక కేవలం VITEEE 2026లో పొందిన ర్యాంక్ ఆధారంగా మాత్రమే ఉంటుంది. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అర్హులు, ఈ సమయంలో వారు తమకు నచ్చిన క్యాంపస్, ప్రోగ్రామ్ మరియు ఫీజు విభాగాన్ని ఎంచుకోవచ్చు. సీట్ల కేటాయింపు అభ్యర్థి ర్యాంక్ మరియు కౌన్సెలింగ్ సమయంలో అందుబాటులో ఉన్న ఎంపికల ఆధారంగా ఉంటుంది. మరిన్ని తాజా సమాచారం మరియు వివరణాత్మక వివరాల కోసం, అభ్యర్థులు అధికారిక VIT వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. https://viteee.vit.ac.in.

# "పోలీసులు ఏకపక్ష ధోరణి సరికాదు – కాకాణి"



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన మాజీ మంత్రి వర్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. రైతుల గురించి, వ్యవసాయం గురించి పట్టించుకునే పరిస్థితులు కూటమి ప్రభుత్వంలో లేవు. కూటమి ప్రభుత్వంలో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. శ్రీవారి లడ్డు విషయంలో తప్పైపోయిందని చెంపలేసుకుని కోట్లాదిమంది వెంకటేశ్వర స్వామి భక్తులకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లోకేష్, బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులు సుభిక్షంగా, సుఖశాంతులతో జీవించారు. 2025 సంవత్సరంలో 2865 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల నివేదికలో వెల్లడించారు. 2024 సంవత్సరంతో పోలిస్తే 4.8 శాతం అధికంగా రైతుల ఆత్మహత్యలు నమోదు కావడం. రైతాంగాన్ని సమాజాన్ని, కలవరపాటుకి గురి చేస్తుంది. కూటమి పాలనలో మనకు అన్నం పెట్టే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరం. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహించి పెట్టుబడి సాయం అందించపోవడం, యూరియా అందించక పోవడం, ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వడంలో అన్ని విధాలుగా విఫలం కావడంతో రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ధాన్యం కొనుగోలు, పంటల కొనుగోలు కేంద్రాలు అని హడావిడి చేయడం తప్ప, రైతులకు మంచి చేయాలనే చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి లేదు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పోలీసులు నివేదికలు ఇచ్చిన తర్వాత కూడా రైతుల పట్ల శ్రద్ధ వహించకపోవడం బాధాకరం. రైతులు ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నా, వారిని పట్టించుకోకపోవడం చూస్తుంటే రైతుల పట్ల చంద్రబాబు నాయుడుకి ఉన్న ఏహ్యాభావం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులను అన్ని విధాలుగా ఆదుకొని, అండగా నిలిచాం. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని నమ్మి, ఆచరణలో చూపించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి. రైతులను ఆదుకోవాలనే భావనతో రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాం, ఉచిత పంటల బీమా అందించాం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే వెంటనే ఆ సీజన్ ముగిసే లోపల ఇన్పుట్ సబ్సిడీ అందించి వారికి అండగా నిలిచిన ఘనత జగన్మోహన్ రెడ్డిది. కేంద్ర ప్రభుత్వం గుర్తించని పంటలకు కూడా జగన్మోహన్ రెడ్డి కనీస మద్దతు ధర ప్రకటించి అందించారు. 2014 నుంచి 19 మధ్య 8845 కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలు పెట్టి చంద్రబాబు వెళ్ళిపోతే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బకాయిలను తిరిగి చెల్లించి, ఉచిత విద్యుత్ సబ్సిడీ ద్వారా 43,744 కోట్లు జగన్మోహన్ రెడ్డి ఇవ్వడం జరిగింది. ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు చంద్రబాబు బకాయిలు చెల్లించకపోతే జగన్మోహన్ రెడ్డి తిరిగి చెల్లించి ఆత్మహత్య చేసుకున్న రైతులకు 5 లక్షల నుండి 7 లక్షల రూపాయల పరిహారాన్ని పెంచాడు, రైతులకు అన్ని విధాల అండగా మేము నిలిచాం కాబట్టే రైతు ఆత్మహత్యలు తగ్గించగలిగాం. చంద్రబాబుకు వ్యవసాయం అంటే నిర్లక్ష్యం, అసూయ, ఈ రాష్ట్రానికి వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నాడా, లేడా అనేది రైతులకు ప్రజలకు అర్థం కాని పరిస్థితి. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం అనేది అత్యంత దురదృష్టకరం. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను వెంటనే ఆదుకొని అన్ని విధాలుగా అండగా నిలవాలి. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఇస్తామన్న హామీలు అన్ని నెరవేర్చి, రైతుల ఆత్మహత్యలు జరగకుండా చూడాలి. కూటమి నాయకులకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారి మీద బురద చల్లాలనే తపన, తాపత్రయం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశం లేదు. కూటమి పాలనలో ప్రశ్నించిన వారిపై దాడులు చేసి, కేసులు పెట్టి, జైలుకు పంపించి మా నోరులు మూయించాలనే దురుద్దేశం తప్ప, అభివృద్ధి చేయాలనే తపన, తాపత్రయం ఎక్కడా కనిపించడం లేదు. కూటమి నాయకులు లడ్డు విషయంలో చేసిన ఆరోపణలన్నీ అబద్ధమని సిట్, సిబిఐతో కూడిన దర్యాప్తులో తేటతెల్లమైంది. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు పవిత్రమైనటువంటి లడ్డు ప్రసాదం విషయంలో కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా లడ్డులో జంతువుల కొవ్వు కలిసిందని దుర్మార్గంగా మాట్లాడారు. శ్రీవారి లడ్డు ప్రసాదం విషయంలో కూటమి నాయకులు మాట్లాడిన మాటలు పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారు. సిట్‌లో సిబిఐ కలిసి దర్యాప్తు చేసి లడ్డులో జంతువుల కొవ్వు, పందికొవ్వు, చేప నూనె, కలవలేదనే నివేదికలు కూటమి నాయకులకు వ్యతిరేకంగా ఇచ్చిన తర్వాత రకరకాలైన దుష్ప్రచారాలకు వడిగట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లడ్డు విషయంలో అడిగే ప్రశ్నలకు సూటిగా సమాధానాలు చెప్పే దమ్ము ధైర్యం, కూటమి నాయకులకు ఉందా. 2019 మార్చి 6వ తేదిన బోలె బాబా డైరీకి పర్మిషన్ ఇచ్చింది టీడీపీ నాయకులు కాదా? అప్పుడు అధికారంలో ఉన్నది మీరు కాదా. – 2019లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే బోలె బాబా డైరీని టెక్నికల్‌గా క్వాలిఫై అయినట్లుగా తీర్మానం ఆమోదించింది చంద్రబాబు ప్రభుత్వంలో కాదా? 2019 మార్చి 6 తారీకు బోలే బాబా డైరీకి సంబంధించి 82000 వేల కేజీల నెయ్యి ఆర్డర్ ఇచ్చింది మీరు కాదా.. దానికి సంబంధించి కేజీ నెయ్యి 230 రూపాయలకు టెండర్ టిడిపి హయాంలోనే ఇచ్చారా, లేదా కూటమి నాయకులు సమాధానం చెప్పాలి. 2019 ఏప్రిల్ 19 తారీకు టిన్నుల రూపంలో 12,300 కేజీల నెయ్యి సరఫరా చేయమని చెప్పారు, వీటికి సంబంధించి చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలి. లడ్డు వ్యవహారంలో జరిగిన డ్యామేజ్ ను పూడ్చుకునేందుకు చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. లడ్డు విషయంలో సమాధానం చెప్పాల్సిన చంద్రబాబు నాయుడు, రాజకీయ లబ్ధి కోసం వైఎస్ఆర్ సిపి హయాంలో కల్తీ జరిగిందంటూ దుర్మార్గమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నియమ నిబంధనలతో కఠినంగా వ్యవహరించాం తప్ప, ఎక్కడా పొరపాట్లు జరగనివ్వలేదు, ఆకాశం మీద ఉమ్మితే మీ మీదే పడుతుంది. సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి ఉన్నాడు కాబట్టే మీరు చేసిన అసత్యాలు, ఆరోపణలు మీకే చుట్టుకున్నాయి, బోలే బాబా డైరీకి సంబంధించిన వాస్తవాలను చంద్రబాబు ప్రజలకు వివరించాలి. భేషరతుగా కూటమి నాయకులందరూ భక్తులకు క్షమాపణలు చెప్పి చెంపలు వేసుకోవాలి. లడ్డు విషయంలో కూటమి నాయకులను ప్రశ్నించాడని రాంబాబు మీద దాడి చేయించి హత్యాయత్నానికి ప్రయత్నించి, చివరి తన మీదే కేసు పెట్టి జైలుకు పంపించడం హేయం. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు రాంబాబు మీద దాడి చేసిన వారిని వదిలేసి, రాంబాబుని అరెస్టు చేయడం సిగ్గుచేటు. జోగి రమేష్ పై దాడి చేసి, ఇంటి మీద పెట్రోల్ బాంబులు వేసి తిరిగి తన మీదే కేస్ పెట్టారు. దాడులు చేసిన వారిని వదిలిపెట్టి బాధితుల మీద కేసులు పెట్టడం, కూటమి ప్రభుత్వంలోనే చూస్తున్నాం. కూటమి నాయకులు ఈ రాష్ట్రాన్ని తమ సొంత జాగీర్‌లాగా మార్చి, వారిని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు, పీటీ వారెంట్లు పెట్టి భయభ్రాంతులకు గురి చేసే విధంగా కేసులు నమోదు చేస్తున్నారు. నామీద అన్యాయంగా వెంకటేశ్వర స్వామి గుడిలో పూజ చేసి మాట్లాడితే కేసు పెట్టారు, కండలేరుకి పోతే కేసు పెట్టారు, కార్యకర్తలతో మాట్లాడితే కేసు పెట్టారు, మైనర్ బాలిక మీద జరిగిన అత్యాచారంలో ప్రశ్నిస్తే మరో కేసు పెట్టారు ,ఎటు పోతుంది ఈ వ్యవస్థ. మైనర్ బాలక విషయంలో ప్రభుత్వ వైఫల్యం, పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నెల్లూరులో ప్రవేట్ హాస్పిటల్స్ ఉండగా చెన్నై హాస్పిటల్‌కి ఎందుకు తీసుకెళ్లాల్సి వచ్చింది, కనీసం ఇక్కడ వైద్యం అందించి ఉంటే ఆ పాప బ్రతికి ఉండేదని వారి తల్లిదండ్రులే ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి వాడకం ఎక్కువైపోయింది. గతంలో అక్కడక్కడ దొరికే గంజాయి ఇప్పుడు పల్లెల్లోకి పాకి, యువత పెడదారి పట్టి, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెల రోజుల లోపల గంజాయిని నిర్మూలిస్తానని, ఆడవారి మీద అఘాయిత్యాలు జరిగితే కఠినంగా శిక్షిస్తానని ప్రగల్భాల్ పలికి ,ఇప్పుడు వాటిమీద ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టిస్తున్నాడు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దురదృష్టకరంగా ఇలాంటి సంఘటన ఒకటి జరిగితే, వెంటనే స్పందించి బాలికను బతికించుకునేందుకు అన్ని విధాలుగా అందుకొని చెన్నైలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి 30 లక్షల రూపాయల బిల్లులు చెల్లించాం. పోలీసులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారు. మైనర్ బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి వెళితే నా మీద అక్రమ కేసు పెడతారా, అబ్దుల్ అజీజ్, కోవూరు శాసనసభ్యురాలు వెళ్లి పరామర్శిస్తే కేసులు పెట్టరా, కూటమి పాలకులకు ఒక న్యాయం నాకు ఒక న్యాయమా? ఇలాంటి దురదృష్టకరమైన పాలన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎప్పుడైనా చూశారా, మా మీద అక్రమ కేసులు పెట్టి ఏం సాధిస్తారు. మీరు ఎన్ని కేసులు పెట్టుకున్నా, కూటమి పాలకుల అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటా, ప్రజలకు అండగా ఉండి, నా పోరాటాలు కొనసాగిస్తా.

# "మహిళలకు రక్షణ కరువు : పూజిత"






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ. గంజాయి బ్యాచ్ దాష్టికానికి బలైన మైనర్ బాలిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పూజితమ్మ. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి, మహిళలకు రక్షణ కరువైంది. ఒంటరిగా ఆడపిల్లలను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దిశా చట్టం ద్వారా మహిళలకు రక్షణ కల్పించారు. ఆంధ్ర రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువై,యువత పెడదారి పడుతున్నారు. రాష్ట్రంలో మహిళలపై ప్రతిరోజు ఏదో ఒక చోట అఘాయిత్యాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయి. గుమ్మళ్ల దిబ్బలో మైనర్ బాలికపై జరిగిన దారుణం నన్ను ఎంతో కలచి వేసింది. పోలీసులు, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మైనర్ బాలిక వేదనకు గురై మృతి చెందింది. మైనర్ బాలిక విష పానీయం త్రాగి తీవ్ర అస్వస్థకు గురై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే, చెన్నైలోని ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించాల్సిన అవసరం ఏముంది. 8 రోజులు ఆ పాప ప్రాణాలతో కొట్టుమిట్టాడి మృతి చెందింది. మైనర్ బాలికను నెల్లూరులోని ఏదైనా ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకు వెళ్లి మంచి వైద్యం అందించి ఉంటే బ్రతికి ఉండేది. ఆడపిల్లకు ఆపద సమయంలో సరైన వైద్యం అందించలేక మృతి చెందడం సిగ్గుచేటు. కూటమి పాలనలో అన్యాయం చేసిన వారిని వదిలిపెట్టి, బాధ్యులకు అండగా నిలిచిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేయడం బాధాకరం. మైనర్ బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన మా నాన్న మీద కేసు పెట్టడం చూస్తుంటే, మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనిపిస్తుంది. మైనర్ బాలిక విషయంలో ఏం జరిగిందో పోలీసులు విచారించి, బాధ్యులను శిక్షించి, బాలిక కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలి. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలపై కూటమి నాయకుల పైనే కేసులు పెట్టాలి. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నెల రోజులు లోపల ఆంధ్ర రాష్ట్రంలో గంజాయి లేకుండా నిర్మూలిస్తానని వాగ్దానం చేశాడు. గంజాయి బ్యాచిని కూటమి నాయకులే పెంచి పోషించి తమ స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారు. గంజాయి బ్యాచ్ వల్ల జరుగుతున్న దారుణాలకు మహిళలు బలవుతున్నారు.

శాంతిభద్రతలు కాపాడాల్సిన విష యంలో పోలీస్ వ్యవస్థ విఫలమైంది. పోలీసులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తల మీద కేసులు పెడుతున్నారు. పోలీసులు ఉండేది ప్రజలకు మంచి చేయడానికే కానీ, అన్యాయం చేసిన వారికి అండగా నిలిచేందుకు కాదు. మైనర్ బాలిక విషయంలో కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి, న్యాయం చేయని పక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మేము పోరాడుతాం, బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం. కూటమి నాయకులు మాపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎదిరించి ప్రజల పక్షాన పోరాడుతాం.

# ఇటువంటి దుర్మార్గపు ఆలోచనలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుంది : ఆనం విజయ్ కుమార్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 12వ డివిజన్ చింతరెడ్డిపాలెంలోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ కార్యాలయం నందు జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ...తిరుపతి తిరుమల దేవస్థానానికి సంబంధించినటువంటి లడ్డు విషయంలో అవినీతి కల్తి జరిగిందని వివిధ రకాలైనటువంటి అభిప్రాయాలతో ప్రజల విశ్వాసంతో పూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెలగాటమాడినటువంటి పరిస్థితులు మొన్న చూశాం వారికి తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అదే రకంగా మంత్రి నారా లోకేష్ వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు మాట్లాడారు. NDDB మరియు NDRI వారు లడ్డులో వాడిన నెయ్యిలో ఎటువంటి జంతు మాంసం గాని చాప నూనె గాని జంతువుల మూలం కానీ లేదు అని రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. ఆ రిపోర్ట్ ని జత చేస్తూ సి.బి.ఐ వారు సుప్రీంకోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. మరి ఎటువంటి కలుషితం లేకుండా భగవంతుడి నైవేద్యం జరిగిందని సంతోషం పడతారా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద వేసిన దుమ్మును మన మొహం మీద పడతా ఉందని తాను చెప్పిన అసత్యానికి కట్టుబడి మళ్లీ జంతు మాంసం అనే మాట కాకుండా రకరకాల కెమికల్స్ కలిశాయి ఈ లడ్డులో చెప్తారు. చంద్రబాబుకి మనసు ఎలా వచ్చిందో బాత్రూంలో వాడేటువంటి క్లీనర్స్‌తో లడ్డును తయారు చేశారని చెప్తున్నారు.

చంద్రబాబు నాయుడు ఎప్పుడు ఏది నిజం చెప్పడు పదవి తప్ప అతనికి ఏది ముఖ్యం కాదు ఆయనకి దేవుడు లేడు భక్తి లేదు. హైందవ సాంప్రదాయాన్ని ఎగతాళి చేస్తే ఒక హిందువుగా మేమందరం దీన్ని ఖండిస్తున్నాం చంద్రబాబు నాయుడు దుష్ట ప్రచారాన్ని అతనికి వత్తాసు పలికినటువంటి పవన్ కళ్యాణ్ చర్యలు గాని పూర్తిస్థాయిలో మేము ఖండిస్తున్నాం. భగవంతుడి ఆశీర్వాదం కోసం కొండని కోట్ల మంది ఎక్కి నడిచిపోయే వాళ్ల మనోభావాల్ని దెబ్బ తీసే విధంగా మీ రాజకీయాల అవసరం కోసం దేవుడి ప్రసాదాలు కూడా మీరు వదిలి పెట్ట లేదంటే హీనమైన సంస్కృతి ఏ పార్టీలో ఉండవు ఈ కూటమి నేతల దగ్గర తప్ప అని మనవి చేస్తున్నాను. ఇటువంటి దుర్మార్గపు ఆలోచనలు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుంది. హిందువుల మానసిక వ్యవస్థపై దెబ్బకొట్టడానికి ప్రయత్నించిన మీరు తప్పనిసరిగా కూటమి నేతలు అందరూ కూడా ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, కలివెలపాళెం సర్పంచ్ పార్లపల్లి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చెన్నారెడ్డి ప్రభాకర్ రెడ్డి, కలివెలపాళెం పి.ఏ.సి.ఎస్ మాజీ చైర్మన్ పార్లపల్లి వీరరాఘవరెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షుడు తోగూరు జాషువా,12వ డివిజన్ ఇంచార్జ్ ప్రసాద్, 12వ డివిజన్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, బాలాజీ, అక్కన్న మదన్ మోహన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# మేధో సంపత్తి హక్కులపై ఏఐ ప్రభావంపై తీసుకున్న చర్యలేంటి? - లోక్ సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్న



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దేశంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిన నేపథ్యంలో మేధో సంపత్తి హక్కులపై దాని ప్రభావం అంచనాకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. మంగళవారం ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. ప్రభావాన్ని అంచనా వేయడానికి నిర్వహించిన సమీక్షలు, ప్రభుత్వ అధ్యయనాలు, క్రియేటర్స్, ఆవిష్కర్తలు, రైట్ హోల్డర్స్ వంటి వారు ఎదుర్కొంటున్న నష్టాలపై ఆరా తీశారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని మేధో సంపత్తి హక్కుల చట్టానికి ఏవైనా సవరణలు, సంస్కరణల ప్రతిపాదనలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానమిచ్చారు. దేశంలో గత ఐదేళ్లుగా మేధో సంపత్తి హక్కులపై కృత్రిమ మేధ ప్రభావాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం ఎలాంటి సర్వేలు చేపట్టలేద న్నారు. ఏఐ – జనరేటెడ్, ఏఐ –సహాయక కంటెంట్ సాంకేతి కతల కారణంగా ఆవిష్కర్తలు, హక్కుదారులు ఎదుర్కొంటున్న నష్టాలపై వివరాలు లేవన్నారు. అయితే ఏఐకు సంబంధించిన ఉద్భవిస్తున్న సమస్యలు, కాపీరైట్ చట్టంపై దాని ప్రభావాలను అధ్యయనం చేయడానికి DPIIT(Department for Promotion of Industry and Internal Trade) ఏప్రిల్ 28, 2025న ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఏఐ శిక్షణలో కాపీరైట్ చేయబడిన కంటెంట్ వాడకంపై కమిటీ ఒక వర్కింగ్ పేపర్‌ను ఖరారు చేసి వాటాదారుల అభిప్రాయం కోసం ప్రచురించబడిందన్నారు. అందులో భాగంగా కాపీరైట్ సందర్భంలో కృత్రిమ మేధస్సు వాడకం వల్ల ఉత్పన్నమయ్యే చట్టపరమైన, విధానపరమైన సమస్యలను గుర్తించడం మరియు విశ్లేషించడం, సమస్యలను పరిష్కరించడంలో కాపీరైట్ చట్టం, 1957 యొక్క ప్రస్తుత నిబంధనల సమర్థతను పరిశీలించడం, సిఫార్సులు చేయడం, విశ్లేషణ ఆధారంగా ఒక వర్కింగ్ పేపర్‌ను తయారు చేసి డిపార్ట్‌మెంట్ ప్రచురిస్తుందని వివరించారు.

# హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరునికి గొడుగులు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** దక్షిణ కైలాసంగా ఖ్యాతి గడుస్తున్న శ్రీ కాళహస్తీశ్వర ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజైన భక్తకన్నప్ప కొండపై కైలాసనాథ స్వామి ధ్వజారోహణము రోజున బ్రహ్మోత్సవాలలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి వాహన సేవలకు అలంకరించేందుకు చెన్నై హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ట్రస్టీ ఆర్.ఆర్.గోపాల్ జీ ఆధ్వర్యంలో ఐదు గొడుగులను శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ అధికారులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ చేతులు మీదుగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వర దేవస్థానానికి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేకంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటం తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ట్రస్టీ ఆర్.ఆర్ గోపాల్‌జీ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి అనుగ్రహంతో గత 15 సంవత్సరాలుగా శ్రీకాళహస్తీశ్వర ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రియ భక్తుడైన భక్త కన్నప్ప కొండపై కైలాసనాథ స్వామి ధ్వజారోహణం రోజున ఈ గొడుగులను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయం డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈ ఓ మోహన్, విద్యాసాగర్, శ్రీకాళ హస్తీశ్వరాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 'యోగ సేతు-2026' పోస్టర్ ఆవిష్కరణ

## - ఫిబ్రవరి 13న జాతీయ స్థాయి యోగా సదస్సు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యువతలో, విద్యార్థుల్లో ఆరోగ్యం మరియు మానసిక ప్రశాంతతపై అవగాహన కల్పించే దిశగా నిర్వహించనున్న "యోగ సేతు--2026" జాతీయ స్థాయి యోగా సదస్సు పోస్టర్‌ను విక్రమసింహపురి విశ్వవిద్యాలయ (విఎస్‌యు) రిజిస్ట్రార్ డా. కె.సునీత బుధవారం ఆవిష్కరించారు. వర్సిటీలోని రిజిస్ట్రార్ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

సదస్సు వివరాలు:

ఆంధ్రుల ఇండియన్ యోగా అసోసియేషన్ (ఏపీ శాఖ), న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ యోగా అసోసియేషన్, జేఎన్‌టీయూ--అనంతపురం మరియు విక్రమసింహపురి విశ్వవిద్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. 2026 ఫిబ్రవరి 13వ తేదీన నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ఈ ఒకరోజు జాతీయ సదస్సు జరగనుంది.

ముఖ్య అతిథులు, సందేశం:

పోస్టర్ ఆవిష్కరణ అనంతరం రిజిస్ట్రార్ డా. కె.సునీత మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా మరియు పరిసర ప్రాంతాలలోని కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు ఈ సదస్సులో విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాబోయే సదస్సుకు విక్రమ సింహపురి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, జేఎన్ టీయూ-అనంతపురం ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో నయాగో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షురాలు డా. జె.కె.స్వప్న, వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్ శంకర్ అల్లం, మై భారత్ కేంద్రం జిల్లా యువజన అధికారి ఏ.మహేంద్ర రెడ్డి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు డా. ఆర్.వి.ఎస్.ఎస్. నాగభూషణ శంకర్, డా. పి.బి. సుచరిత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి భేటి

**- రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వినతి - సివిల్ సప్లయ్ అధికారులు రైతులకు సకాలంలో గోనె సంచులు అందచేసేలా ఆదేశించండి - ధాన్య సేకరణకు సంబంధించి పౌర సరఫరా శాఖ సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు త్వరగా చెల్లించేలా చొరవ చూపండి**



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నెల్లూరు నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో చర్చించారు. ధాన్య సేకరణ సందర్భంగా రైతులు ఎదుర్కుంటున్న పలు సమస్యలను ఆమె జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆమె జిల్లా కలెక్టర్‌కి మెమరాండం సమర్పించారు. ధాన్య సేకరణ సందర్భంగా నియ మించే టెక్నికల్ అసిస్టెంట్ల స్థానంలో రైతుల సమస్యలపై అవగా హన వున్న విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. ధాన్య సేకరణలో కీలక పాత్ర పోషించే సహాకార సంఘాలకు పౌర సరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ 2021వ సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉందని సకాలంలో చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరారు. సివిల్ సప్లై వారు కమీషన్ చెల్లించని కారణంగా సహకార సంఘాల నిర్వహణ భారంగా మారిందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కలెక్టర్‌కి తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు రైతులకు సకాలంలో ఖాళీ గోనె సంచులు అందచేసేలా ఆదేశించాలన్నారు. ధాన్యం రవాణా పరంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రబీ సీజన్ ధాన్యం కొనుగోలకు సంబంధించి ఏర్పాట్ల కోసం నెల ముందుగానే సహకార సంఘాలకు అడ్వాన్స్ కమీషన్ చెల్లించాలని కోరారు. దీంతో పాటు నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిని పూర్తయ్యేలా సహకరించాలని ఆమె ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభ్యర్థనతో వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కోవూరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాధమిక సహాకార సంఘాలకు చెల్లించాల్సిన 6 కోట్ల 89 లక్షల 98 వేల 544 రూపాయల పాత బకాయిలను త్వరగా చెలియించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ని ఆదేశించారు. సివిల్ సప్లై అధికారులతో సమన్వయం చేసుకొని ఖాళీ గోనె సంచులు, ధాన్యం రవాణా తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్‌ని కలిసిన వారిలో మండల వ్యవసాయ అధికారిణి అనిత, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఇ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మరియు కెవి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ సాగును ప్రోత్సహించేందుకు ఏపీకి రూ.167 కోట్లు

## - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దేశంలో సేంద్రీయ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో వివరాలు కోరారు. ఏపీకి సేంద్రీయ సాగుకు కేంద్రం అందిస్తున్న సబ్సిడీ, గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో పరంపరగత్ కృషి వికాస్ యోజన కింద సేంద్రీయ రైతులకు అందించిన సహాయం, జిల్లాల వారీగా అందించిన శిక్షణా కార్యక్రమాల వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు 2015-16 లో కేంద్ర ప్రభుత్వం పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకాన్ని ప్రారంభించిందని, ఇక ఈశాన్య రాష్ట్రాల కోసం మిషన్ ఆర్గానిక్ వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ ఫర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ అని మరో పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ రెండు పథకాలు సేంద్రీయ వ్యవసాయంలో నిమగ్నమైన రైతులకు ఉత్పత్తి నుండి ప్రాసెసింగ్, సర్టిఫికేషన్, మార్కెటింగ్ వరకు సంపూర్ణ మద్దతుపై దృష్టి పెడతాయన్నారు. ఈ రెండు పథకాలు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాల ద్వారా అమలు చేయబడుతున్న నేపథ్యంలో రాష్ట్రాలకు అందించే సబ్సిడీకి సంబంధించిన జిల్లా వారీ డేటాను కేంద్రస్థాయిలో నిర్వహించట్లేదన్నారు. PKVY కింద 2020-21 మధ్య రూ.100 కోట్లు, 2023-24లో 9.70 కోట్లు, 2024-25లో 28 కోట్లు, 2025-26 లో 29.46 కోట్లు చొప్పున 167.20 కోట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించినట్లు వివరించారు. 2021-22, 2022-23 మధ్య ఎలాంటి కేటాయింపులు చేయలేదని పేర్కొన్నారు. PKVY పథకం కింద, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి 3 సంవత్సరాలలో హెక్టారుకు రూ. 31,500 సహాయం అందిస్తున్నామని, ఇందులో రైతులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా 15 వేలు, మార్కెటింగ్, బ్రాండింగ్ కోసం 4,500, సర్టిఫికేషన్ కోసం 3,000, శిక్షణ, మరియు సామర్థ్య పెంపు కోసం 9,000 సహాయం అందుతుందన్నారు. ఇక MOVCDNER కింద, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటుకు, సేంద్రీయ ఇన్‌పుట్‌ల కోసం రైతులకు మద్దతు ఇవ్వడానికి 3 సంవత్సరాలలో హెక్టారుకు రూ. 46,500 సహాయం అందించబడుతుందని, ఇందులో సేంద్రీయ ఇన్‌పుట్‌ల కోసం రైతులకు రూ. 32,500, సహాయం అందించబడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో PKVY పథకం కింద 2024-25 సంవత్సరం వరకు 8,564 మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ 11,29,931 మంది రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారన్నారు. అలాగే పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టమ్ - ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ కింద నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ద్వారా 5,146 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## మృగ్యమైన మావలంకర్ వారసత్వం

'లోక్‌సభ తొలి స్పీకర్ జీవీ మావలంకర్, రెండవ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్, రాజ్యసభ తొలి చైర్మన్, ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంస్థల పనితీరుపై గొప్ప ప్రభావాన్ని చూపారు. నిబంధనలు, విధానాలు, సంప్రదాయాలు, పద్ధతులను రూపొందించడంలో వారు హుందాగా, నిష్పాక్షికంగా వ్యవహరించేవారు. రాజ్యసభలో జన సంఘ్‌కు ప్రాతినిధ్యం ఉండకపోయినా నేను అతిథుల గ్యాలరీల నుంచి అక్కడి చర్చలను తిలకించేవాడిని. ప్రశ్నోత్తరాల సమయం, వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్థాయీ సంఘాలు, సావధాన నోటీసులు, సభ్యుల హక్కులు మొదలైన వాటన్నింటి గురించి నేర్చుకునే అవకాశం నాకు వారి వల్లే లభించింది. ప్రతిపక్ష బెంచీల్లో కూర్చున్న హేమాహేమీలు కూడా అధికార పక్షం వైపు కూర్చున్న సభ్యులతో సమానంగా అనర్గళంగా మాట్లాడేవారు. ప్రతిపక్షాల హక్కులకు సంరక్షకుడుగా స్పీకర్ నిజాయితీతో వ్యవహరించేవారు. ఈ ఉత్తమ సంప్రదాయాల వల్లే భారత దేశ ప్రజాస్వామ్యం పరీక్షలకు తట్టుకుని నిలబడింది. అంతర్జాతీయంగా తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది' ఈ మాటలు ఎవరివో కాదు, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన లాల్‌కృష్ణ ఆడ్వాణీవి. తన ఆత్మకథ 'నా దేశం నా జీవితం' లో ఒకప్పటి పార్లమెంటరీ ప్రమాణాల గురించి ఆడ్వాణీ వివరంగా రాశారు. ఏ ప్రమాణాలైనా వ్యక్తులు నిలబెడితేనే సుస్థిరంగా ఉంటాయి. వ్యక్తులు తమ ప్రయోజనాలకోసం ప్రమాణాలను పణంగా పెడితే ఉదాహరణగా చెప్పుకోవడానికి ఏ ప్రమాణాలూ నిలువవు. సమాజంలో దిగజారుతున్న విలువలు పార్లమెంటరీ చర్చలను ప్రభావితం చేస్తే మన ప్రజాస్వామ్య పతనం ఎలా ఉంటుందో చెప్పేందుకు నేడు చట్టసభలు సాగుతున్న తీరే నిదర్శనం. 'మీరు మాకు మార్గనిర్దేశనం చేయండి, మేము దారి తప్పితే అవసరమైతే మాకు బుద్ధి చెప్పండి. మా ప్రవర్తనను సరిదిద్దండి' అని తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ లోక్‌సభ తొలి స్పీకర్ గణేశ్ వాసుదేవ్ మావలంకర్ ను అభ్యర్థించారు. ఎప్పుడైనా తీవ్ర విభేదాలు నెలకొన్నప్పుడు ప్రధానమంత్రి, స్పీకర్, కార్యదర్శి కలసికట్టుగా సంప్రదించుకుని సమస్యను పరిష్కరించేవారు. ఒక రోజు సభలోనే మావలంకర్, నెహ్రూ మధ్య వాగ్వివాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజు రెండోసారి ప్రకటన చేయాలని నెహ్రూ సంకల్పించారు. అయితే అలా మాట్లాడడం నిబంధనల ప్రకారం కుదరదని మావలంకర్ స్పష్టం చేశారు. నెహ్రూ సరేనంటూ వెనక్కు తగ్గారు. ఆర్డినెన్స్‌లను మావలంకర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. అరుదైన పరిస్థితుల్లో మినహా ఆర్డినెన్సులు జారీ చేయవద్దని స్పష్టంగా చెప్పేవారు. ఈ విషయమై ప్రధానికి లేఖ రాసేవారు. న్యాయపరమైన సందేహం వస్తే స్వయంగా అటార్నీ జనరల్‌ను సంప్రదించేవారు. స్పీకర్ న్యాయమూర్తిగా వ్యవహరించాలని మావలంకర్ చెప్పేవారు. నెహ్రూ కూడా మావలంకర్‌కు సమున్నత గౌరవం ఇచ్చేవారు. పార్లమెంటరీ కమిటీల్లో తమ నిర్ణయాలను శల్యపరీక్ష చేస్తున్నారని అధికారులు నెహ్రూకు ఫిర్యాదు చేసినప్పుడు దాని గురించి మాట్లాడడం తన పరిధిలో లేదని, స్పీకర్ నే సంప్రదించమని సలహా ఇచ్చేవారు. అనేక విషయాలకు సంబంధించి మావలంకర్ రూపొందించిన నియమ నిబంధనలే ఇప్పటికీ ఉన్నాయి. ' పాలక, ప్రతిపక్షాల మధ్య సరైన సమతుల్యత ఉండేలా చేస్తూ, సభను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రజల ప్రయోజనాలను కాపాడిన సభాపతి జీవీ మావలంకర్ 'అని లోక్ సభ తొలి సెక్రటరీ జనరల్ ఎమ్ఎన్ కౌల్ అన్నారు. పార్లమెంటు ప్రభుత్వ అధికారాలకు లోబడి ఉండకూడదని స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాలని నిర్ణయించిన మావలంకర్ గుజరాత్ నుంచి ఎన్నికైన సభ్యుడు కావడం గమనార్హం. మావలంకర్ మరణం తర్వాత స్పీకర్ అయిన అనంతశయనం అయ్యంగార్ కూడా అదే దారిలో నడిచారు. తిరుపతి సమీపంలోని తిరుచానూర్‌లో వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అయ్యంగార్ లోక్ సభను నిష్పాక్షికంగా నడిపించేవారు. 'ఒక నియంత పాలనలో గానీ లేదా సంపూర్ణ రాచరిక పాలనలో గానీ పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు ఎలాంటి రక్షణ ఉండదు. నియంత మంచి వాడైతేనే ప్రజలు క్షేమంగా ఉంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులు తమ వర్గాలకే అనుకూలంగా వ్యవహరిస్తూ చట్టసభలో తక్కువ సంఖ్యలో ఉన్న వారిని అణిచివేసే ప్రమాదం ఉంది. ఈ ధోరణులను కఠినంగా నియంత్రిస్తూ తక్కువ సంఖ్యలో ఉన్న సభ్యుల ప్రయోజనాలను కాపాడగలిగిన వ్యక్తి సభాధ్యక్షుడు (స్పీకర్) మాత్రమే' అని అయ్యంగార్ ఒక సందర్భంలో స్పష్టం చేశారు. ఇంగ్లీషులో హిరేన్ ముఖర్జీ (సీపీఐ), హిందీలో అటల్ బిహారీ వాజపేయి (జనసంఘ్)ను మించిన వక్తలు లేరని ఆయన కొనియాడేవారు. సరైన సంఖ్యాబలం లేనందువల్ల ప్రతిపక్ష నాయకుడంటూ లేకపోయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులందరికీ అయ్యంగార్ ఎంతో గౌరవం ఇచ్చి వారు మాట్లాడేందుకు వీలు కల్పించేవారు. రెండవ లోక్‌సభలో అధికార ప్రతిపక్ష సభ్యులందరూ ఏకగ్రీవంగా అయ్యంగారే మళ్లీ స్పీకర్ కావాలని ప్రతిపాదించారంటే ఆయన సంపాదించిన గౌరవం, నిలబెట్టిన ప్రమాణాలే కారణం. 1972లో తిరుపతి నుంచి ఒక దళిత క్రైస్తవ ఎమ్మెల్యేను నిలబెట్టినప్పుడు ఆయనను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థన మేరకు అనంతశయనం అయ్యంగార్ రంగంలోకి దిగారు. 'విశిష్టాద్వైతంలోనే లౌకిక వాదం జీర్ణించుకుపోయింది' అంటూ ఆయన తనను ప్రశ్నించిన తన వర్గీయులకు జవాబు చెప్పి ఆ ఎమ్మెల్యేను గెలిపించారు. అయ్యంగార్ తర్వాత స్పీకర్ అయిన సర్దార్ హుకం సింగ్ తొలిసారి నెహ్రూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాలను ఆమోదించారు. ప్రభుత్వం కంటే పార్లమెంట్ ఆధిక్యతే ఎక్కువ అని ప్రకటించారు.

# యాత కులస్తుల్లారా..మేలుకోండి



విశాఖపట్నం, (రాజధాని వార్తలు): కుటుంబ సమగ్ర సర్వేలో మీ కులం యాతగా నమోదు చేసుకోండి బీసీ "ఏ" రిజర్వేషన్ పొందండి. ప్రచార పత్రిక విడుదల చేసిన యాతకుల పెద్దలు. (గవర్నమెంట్ వారు జారీ చేసిన జీవో నెం : 1793 తేది 23-9-1970 కులస్తులకు బి.సి. ఎ.గా ప్రభుత్వం పరిగణించింది. గ్రేటర్ విశాఖలో కొన్ని తరాలుగా నివసిస్తున్న యాత కులస్తులారా మీరు ఆర్థికంగా, సామాజికంగా విద్య, ఉద్యోగాలలో వెనుకబడి వున్నారు. మీరు యాత కులస్తులమని చెప్పుకోవడానికి చిన్నతనంగా వుంటుందని భావించి శెట్టిబలిజ అని పిలుపించుకుంటే సంఘంలో గౌరవంగా వుంటుందని భావించారు. ఈ విధంగా పిలుపించుకోవడంలో మీకు ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలను కోల్పోతున్నారు. యాతకులస్తులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ : ఎం.ఎస్. 1793 తేది 23-09-1970 సీరియల్ నెం: 33 యాత కులస్తులను బి.సి. 'ఎ' గా పరిగణిస్తూ జి.వో. జారీ చేయడమైనది. ఇప్పటికీ మీరు అన్నిరంగాల్లో వెనుకబడి వున్నారు. ఇప్పటికైనా 'యాతకులస్తులందరూ ఈ విషయాలను గ్రహించాలి. మండల కార్యాలయాల్లో కుల ధృవీకరణ సర్టిఫికేట్లకు దరఖాస్తు చేసుకొనేటప్పుడు మీరు మీ కులం యాతకులం అని నమోదు చేసుకొని బి.సి. 'ఏ' సర్టిఫికేట్ను పొందవచ్చు. మీరు ఎన్నో ఏళ్ళనుంచి నగరంలో ప్రభుత్వం ఇచ్చిన స్కీమ్ ఇళ్ళల్లో నివసిస్తున్నామని అధికార్లుకు తెలియపరచవచ్చు, మీ పిల్లల చదువుల్లో, ఉ ద్యోగాల్లో బంగారు భవిష్యత్తు కల్పిస్తారని వారికి బి.సి. 'ఎ' సర్టిఫికేట్లను తీసుకొని మీ పిల్లలను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుస్తారని ఆశిస్తున్నాము. మీ పిల్లల భవిష్యత్ మీ చేతుల్లోనే వుంది. ఎవరికైనా కులధృవీకరణ పత్రం కావలసినవారు సంఘం ప్రతినిధులను సంప్రదించవచ్చును. ఈ కార్యక్రమంలో యాతకుల పెద్దలు అత్తిలి శంకర్రావు, పిల్లి రమణ 29వ వార్డు తెలుగుదేశం ప్రెసిడెంట్ గండిపల్లి సతీష్, 31 వ వార్డు తెలుగుదేశం ప్రెసిడెంట్ బత్తిన నవీన్, ఈశ్వర్ రావు, మేడిశెట్టి రమణ, దొడ్డి రాజు, పోలవరపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నాం : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి


విశాఖపట్నం, (రాజధాని వార్తలు): నగరంలో మెరుగైన రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పేర్కొన్నారు. మంగళవారం విశాఖపట్నం తూర్పు నియోజక వర్గంలోని పలు ప్రాంతాల్లో తారు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మరమ్మత్తులకు గురైన రహదారులను వర్షాకాలం రాక ముందే బాగు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగానే పలు రహదారులకు శంఖుస్థాపనలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రహదారులు ఎలా ఉన్నాయో ఇప్పుడు రహదారులు ఎలా ఉన్నాయో ప్రజలు గమనించాలని కోరారు. ఈ మార్పు తమ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శన మన్నారు. విశాఖకు కేంద్రం మెట్రో రైలు ప్రాజెక్ట్ మంజూరు చెయ్యడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 2 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో జీవీఎంసీ19వ వార్డు పరిధిలోని ఎంవిపి సెక్టర్ 11, సెక్టర్ 12, లాసన్స్ బే కాలని నంది గుడి ప్రాంతాల్లో నిర్మించనున్నతారు



రోడ్లకి శంఖుస్థాపన చేశారు. వీటితో పాటుగా 17వ వార్డు మద్ది వారి వీధిలో సంఘం బిల్డింగ్, ఆర్చ్ వద్ద భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ మరమ్మతుల కార్యక్రమానికి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో 17వ వార్డు టీడీపి అధ్యక్షుడు నెక్కంటి సత్తిబాబు, 17వ వార్డు టీడీపీ సీనియర్ నాయకుడు కాళ్ల శంకర్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ భైరెడ్డి పోతన రెడ్డి, చిన్నపిల్లి నరేంద్ర రెడ్డి, 20వ వార్డు టీడీపి కార్యనిర్వాహక అధ్యక్షుడు గొరుసు అప్పల రెడ్డి, టీడీపీ నాయకులు అలజంగి ఈశ్వరరావు, మతల రమణ, భద్రరావు, గొలగాని రామారావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నీలమాంబ అమ్మవారి అన్నదానానికి వాసుపల్లి రూ. 10,000/-లు విరాళం

### - పండుగ మహోత్సవానికి ఆహ్వానించిన కమిటీ సభ్యులు



విశాఖపట్నం, (రాజధాని వార్తలు): దక్షిణ నియోజక వర్గంలో 36వ వార్డు రంగిరీజు వీధిలో జరగనున్న శ్రీ నీలమాంబ అమ్మవారి 44వ పరస మహోత్సవానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్‌కి కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆసిల్ మెట్ట కార్యాలయంలో ఆదివారం మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు ఆధ్వర్యంలో శ్రీ నీలమాంబ సేవా సమాజం సభ్యులు దానేష్ తదితరులు వాసుపల్లి నీ కలిశారు. ఈ మేరకు వాసుపల్లి సొంత నిధులతో 15వ తేదీ ఆదివారం జరగనున్న అన్న సమారాధనకు 10,000 /- విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లా డుతూ ప్రతి ఏడాది మాదిరిగా ఉత్సవం అత్యంత విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. శ్రీ నీలమాంబ అమ్మవారి కరుణా కటాక్షం ప్రజలందరిపై ఉండాలని కోరారు. 9వ తేదీన తోలే ళ్లు, పదవ తేదీన పరస మహోత్సవం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మహోత్సవానికి హాజరై తప్పకుండా అమ్మవారిని దర్శించుకుంటానని వాసుపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ వేవ్స్ వింగ్ ప్రెసిడెంట్ కాకి పద్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పెట్టుబడి అవసరం లేకుండా పనిచేసే వారి కోసం ప్రయోజనకరమైన రేయాన్ రూపే యాప్ ప్రారంభం





విశాఖపట్నం, (రాజధాని వార్తలు): డబ్బులు పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండా కేవలం పని చేయడం ద్వారానే డబ్బు సంపాదించడం కోసం భద్రాద్రి సీతారాముని ఆశీస్సులతో రేయాన్ రూపే అనే యాప్‌ను సన్ గ్రీన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.శృతి చేతుల మీదుగా ప్రారంభించామని ఆర్ఆర్ పే సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పాతనబోయిన సంతోష్ కుమార్, చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ నక్క రఘునాథ్ రెడ్డి మరియు డైరెక్టర్ పగిళ్ళ లోకేష్ తెలిపారు.
స్థానిక బీచ్ రోడ్లోని హిడెన్ గార్డెన్స్ కమ్యూనిటీ హాల్లో పలువురు టీం లీడర్స్, యాక్టివ్ మెంబర్స్ సమక్షంలో ఈ యాప్‌ను, లోగోను విడుదల చేశామన్నారు. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం క్రొత్త పుంతలు త్రొక్కుతున్న నేటి రోజుల్లో ఇటువంటి యాప్‌ల వల్ల కష్టపడి పనిచేసే వారికి ఇది అత్యంత ఉపయోగకరమన్నారు. తెలంగాణ, ఆంధ్రా ప్రజల సౌలభ్యం కోసం ఈ యాప్ తయారు చేసినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ పే సంస్థ నెట్వర్క్ మార్కెటింగ్ టీం లీడర్స్ సాయి భ్రమరాంబ, శ్రీరామ్, సాయి, సత్య, చినబాబు, తరుణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



అమలాపురం, (రాజధాని వార్తలు): కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్ర నష్టం కలిగించేలా తీసుకువస్తున్న చట్టాలను రద్దు చేయాలని ఏఐటియుసి నేతలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో బోణం చిన్న అధ్యక్షతన మంగళవారం జరిగిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏ ఐ టీ యు సి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 30 వేలు ఇవ్వాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని యథాతదంగా అమలు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 12న జరిగే దేశావ్యాపిత సమ్మెలో యావన్మంది కార్మికులు, ఉద్యోగులు, ఉపాధి కూలీలు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 12వ తేదీ ఉదయం 9 గంటలకు మలికిపురం గాంధీ బొమ్మల సెంటరకు కార్మికులు అందరూ చేరుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె.సత్తిబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, యూనియన్ నాయకులు కామిశెట్టి నాగార్జునరావు, కట్టా పెద్దిరాజు, రామారావు, నాగేశ్వరరావు, నల్లి. ప్రసాద్, రాపాక చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథంతో గ్రామాలు పరిశుభ్రత



పెద్దాపురం, (రాజధాని వార్తలు):గ్రామాలన్ని పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిరివాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ తెలిపారు. పెద్దాపురం మండలం సిరివాడ గ్రామంలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గృహాల్లో వాడి వదిలివేసిన చెత్తను అందించడం ద్వారా మనక అవసరమైన నిత్యవసర వస్తువులు ప్రభుత్వం అందజేస్తుందని సెక్రటరీ వెల్లడించారు. ఈ సందర్భంగా వాహనం యొక్క ప్రయోజనాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భీమలింగం బాబులు, బుక్క రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పలంకలో అధికారుల పర్యటన



కరప, (రాజధాని వార్తలు): కరప మండలం, ఉప్పలంకలో ఎంపీడీవో జటావల్లభుల్ల శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు మంగళవారం పర్యటించారు. పరిశుభ్రతను మెరుగు పరిచే దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామస్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకుండా ప్రత్యేకంగా భద్రపరచాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. చెత్తను శాస్త్రీయంగా వేరు చేయడం ద్వారా పునర్వినియోగ అవకాశాలు పెరగడంతో పాటు, పర్యావరణ పరిరక్ష ణకు తోడ్పడతామని తెలిపారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, శుభ్రమైన గ్రామాల ద్వారా ఆరోగ్యకర మైన వాతావరణం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఐవిఆర్ ఎస్ కాల్స్పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భవాని, సిబ్బంది, గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులు తది తరులు పాల్గొన్నారు.

# అప్పుడు నాని.. ఇప్పుడు శ్రీవిష్ణు.. రిజల్ట్ సంగతేంటి?



టాలీవుడ్ హీరోలు ఏడాదికి ఒకటి లేదా రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడం సహజమే. కానీ ఒకే హీరో నటించిన రెండు చిత్రాలు ఒకే రోజు థియేటర్లలోకి రావడం మాత్రం చాలా అరుదు. ఇప్పుడు యంగ్ హీరో శ్రీవిష్ణు కెరీర్ లో అదే జరుగనుంది. ఈసారి తనకు తానే ఆయన పోటీగా దిగడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. శ్రీ విష్ణు లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న మృత్యుంజయ్, విష్ణు విన్యాసం చిత్రాలు ఫిబ్రవరి 27న ఒకే రోజు విడుదలకు సిద్ధమయ్యాయి. దీంతో ఇప్పుడు ఆ విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది. ఒకే హీరో నుంచి ఒకే రోజు రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానుండడంతో ఏ చిత్రం ఎలాంటి రిజల్ట్ సాధిస్తుందో అన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది. అయితే శ్రీ విష్ణు కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ తన కంటూ ప్రత్యేక మార్క్ సెట్ చేసుకున్నారు. కంటెంట్ బేస్డ్ మూవీలు, కామెడీ ఎంటర్టైనర్లు, యాక్షన్ డ్రామాలు ఇలా అన్ని జానర్లలో తన యాక్టింగ్‌తో ఆకట్టుకుంటున్నారు. ఇప్పుడు మృత్యుంజయ్ మూవీ యాక్షన్, ఎమోషన్స్‌తో సీరియస్ టోన్‌లో ఉండనుండగా, విష్ణు విన్యాసం మాత్రం ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఫన్‌తోపాటు మెసేజ్ ఇచ్చే కథగా రూపొందిందని సమాచారం. రెండు సినిమాలు భిన్న జానర్లలో ఉండటంతో వేర్వేరు ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాయి. అందుకే కలెక్షన్లపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కానీ థియేటర్ల పంపిణీ, షోల కేటాయింపుల విషయంలో మాత్రం సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే శ్రీవిష్ణు లాగే గతంలో నేచురల్ స్టార్ నాని కూడా ఒకే రోజు రెండు సినిమాలతో వచ్చారు. 2015 మార్చి 21న ఆయన నటించిన ఎవడే సుబ్రహ్మణ్యం, జెండాపై కపిరాజు చిత్రాలు విడుదలయ్యాయి. అందులో ఎవడే సుబ్రహ్మణ్యం విమర్శకుల ప్రశంసలు అందుకుని మంచి విజయం సాధించగా, జెండాపై కపిరాజు మాత్రం ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయినప్పటికీ నానికి ఆ సినిమా కెరీర్‌లో మైల్ స్టోన్ మూవీగా నిలిచింది. ఇప్పుడు అదే తరహాలో శ్రీ విష్ణు కూడా రిస్క్ తీసుకుంటూ డబుల్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు. దీంతో సోషల్ మీడియాలో ఇప్పటికే శ్రీ విష్ణు VS శ్రీ విష్ణు అంటూ హ్యాష్ ట్యాగ్ ట్రెండ్ అవుతోంది.

అయితే కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటే రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించే అవకాశం ఉందని పలువురు సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఫిబ్రవరి 27వ తేదీన థియేటర్లలో శ్రీ విష్ణు డబుల్ ఎంటర్టైన్మెంట్ ఇవ్వబోతున్నారని చెప్పాలి. మరి ఈ పోటీలో ఒక్క సినిమానే విజయం అందుకుంటుందో? లేక రెండూ హిట్ అవుతాయా? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజుల వరకు వేచి చూడాల్సిందే.

# ఐకాన్ స్టార్ సక్సెస్‌ను బాలీవుడ్ జీర్ణించుకోవడం లేదా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం పాన్ ఇండియా రేంజ్‌లో దూసుకుపోతున్న టాప్ హీరోల్లో ఒకరని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. పుష్ప సిరీస్ చిత్రాలతో నేషనల్ వైడ్‌గా ఓ రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకున్న బన్నీ.. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. పుష్ప 2 విజయంతో ఆయన రేంజ్ మరింత పెరిగింది. అయితే ఇదే సమయంలో సోషల్ మీడియాలో అల్లు అర్జున్ పై నెగెటివ్ ప్రచారం జరుగుతోందన్న చర్చ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. బాలీవుడ్ వర్గాలు కావాలనే బన్నీ ఇమేజ్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఫేక్ రూమర్స్, కలెక్షన్లపై అనుమానాలు, పర్సనల్ కామెంట్స్.. ఇలా సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టులు పెరుగుతున్నాయని అభిమానులు ఆరోపిస్తున్నారు. దీంతో ఐకాన్ స్టార్ సక్సెస్‌ను బాలీవుడ్ జీర్ణించుకోలేకపోతుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో ప్రభాస్ విషయంలో కూడా ఇలాంటి పరిస్థితి కనిపించిందని ఆయన ఫ్యాన్స్ గుర్తు చేస్తున్నారు. పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన తర్వాత డార్లింగ్ పై కూడా నెగిటివ్ ప్రచారం జరిగిందని చెబుతున్నారు. ముఖ్యంగా రీసెంట్‌గా ది రాజా సాబ్ విడుదల తర్వాత సోషల్ మీడియాలో అనవసరమైన ట్రోలింగ్ జరిగిందని అభిమానులు అంటున్నారు. ఇప్పుడు అదే తరహాలో అల్లు అర్జున్ టార్గెట్ అవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే పుష్ప 2 విజయంతో బాలీవుడ్ హీరోలకు సమానంగా బన్నీ మార్కెట్ పెరగడం కొందరు జీర్ణించుకోవడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది. నార్త్‌లో తెలుగు హీరో సినిమాకు ఇంతటి కలెక్షన్లు రావడం అక్కడ ఆశ్చర్యానికి గురి చేసిందని అభిమానులు చెబుతున్నారు. దీంతో కావాలనే నెగిటివ్ స్టోరీలు క్రియేట్ చేస్తున్నారన్న అనుమానిస్తున్నారు. అయితే ఆ ఆరోపణల్లో ఎంతవరకు నిజం ఉందనేది చెప్పలేం.

స్టార్ డమ్ పెరిగేకొద్దీ విమర్శలు రావడం సహజమేనని కొందరు సినీ ప్రియులు ఇప్పుడు అభిప్రాయపడు తున్నారు. సోషల్ మీడియా జనరేషన్‌లో ఫేక్ న్యూస్, ట్రోల్స్ స్పీడ్‌గా వైరల్ అవుతుంటాయి. కాబట్టి ప్రతి విషయాన్ని తప్పుగా చూడటం కూడా సరైనది కాదని అంటున్నారు. మరోవైపు అల్లు అర్జున్ మాత్రం తన పనిపై ఫోకస్ పెట్టి ముందుకు సాగుతున్నారు. సినిమాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ పాన్ ఇండియా మార్కెట్‌ను మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆడియన్స్ సపోర్ట్ ఉన్నంత కాలం ఎలాంటి నెగిటివిటీ ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయలేదని అభిమానులు చెబుతున్నారు. మొత్తానికి, అల్లు అర్జున్‌పై జరుగుతున్న నెగిటివ్ క్యాంపెయిన్‌లో నిజంగా బాలీవుడ్ యాంగిల్ ఉందా? లేక సోషల్ మీడియా హడావుడా? అన్నది క్లారిటీ రావాల్సి ఉంది. కానీ ఒక విషయం మాత్రం ఖాయం.. ఐకాన్ స్టార్ క్రేజ్ మాత్రం అలాగే కొనసాగుతోంది.

# రెడ్ డ్రెస్‌లో మానస అందాలు.. ఆ పిక్స్ అదుర్స్!



సోషల్ మీడియాను ఈ మధ్య సెలబ్రిటీలు పాపులారిటీ సంపాదించుకోవడానికి ఆయుధంగా మలుచుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా తమ ట్రెండీ ఫ్యాషన్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను కూడా మెప్పిస్తున్నారు. ముఖ్యంగా తమ డ్రెస్ సెన్స్‌తో అమ్మాయిలకు సరికొత్త ఫ్యాషన్‌ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో కాలేజ్‌కి వెళ్ళే అమ్మాయిలు కూడా హీరోయిన్స్ డ్రెస్సింగ్‌ను ఫాలో అవుతున్నారు అంటే ఇక సెలబ్రిటీలు ఏ రేంజ్‌లో యువతను ఆకట్టుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. కాలానుకనుగుణంగా చాలా అందంగా తయారవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మలు.. అటు ఫాలోవర్స్‌ని కూడా పెంచుకుంటున్నారు. ఒకవైపు అందాలు ఆరబోస్తూ మరొకవైపు కొన్ని ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ భారీగా ఆదాయాన్ని పెంపొందించుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇప్పుడు తన అందంతో ఆకట్టుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇలా ఘాటు మిర్చీలా రెడ్ డ్రెస్‌లో ఫోటోలు షేర్ చేసి అందరినీ ఆకట్టుకుంది మానస వారణాసి. అందం, అభినయంతో అభిమానులను ఆకట్టుకునే ఈ చిన్నది సింపుల్ స్మైల్‌తో మనసుకు హత్తుకునేలా ఫోటోలకు ఫోజులిచ్చింది. విషయంలోకి వెళ్తే.. సంతోష్ శోభన్ హీరోగా మానస వారణాసి హీరోయిన్గా తెరకెక్కుతున్న చిత్రం కపుల్ ఫ్రెండ్లీ. ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఇటీవల మంగళవారం హైదరాబాదులో ఒక ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర బృందం. అందులో భాగంగానే తన అద్భుతమైన డ్రెస్సింగ్ సెన్స్‌తో అందర్నీ ఆకట్టుకున్న ఈమె.. అవే ఫోటోలను ఫోటోషూట్ నిర్వహించి సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఇందులో సింపుల్ స్మైల్‌తో ఆకట్టుకుంటూనే మరొకవైపు గార్జియస్ లుక్‌లో కనిపించి ఆడియన్స్ హృదయాలను దోచుకుంది. ఇకపోతే ఈ లుక్‌లో ఈమెను చూసిన కొంతమంది అభిమానులు జూనియర్ అనుపమ అంటూ కామెంట్ కూడా చేస్తున్నారు. మొత్తానికైతే మానస వారణాసి పంచుకున్న ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విపరీతంగా వైరల్గా మారింది. ఇకపోతే వాలెంటైన్స్ డే సందర్భంగా తన సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో.. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మానస వారణాసి మాట్లాడుతూ.. ప్రేమపై తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది. మనం మన ఇంట్లో మన కుటుంబ సభ్యుల మధ్య ఎంత భద్రతగా ఫీల్ అవుతామో ..ప్రేమికుడి వద్ద అంతే భద్రతగా ఉండాలి. అదే అసలైన ప్రేమకు నిర్వచనం అంటూ చెప్పుకొచ్చింది.. మొత్తానికైతే అటు తన నటనతోనే కాదు ఇటు అద్భుతమైన అభిప్రాయాలను పంచుకుంటూ వార్తల్లో నిలుస్తోంది మానస వారణాసి. మానస వారణాసి తెలంగాణకు చెందిన మోడల్.. కోకోకోల మ్యూజిక్ హాల్ 2021 భారతదేశం తరఫున మిస్ వరల్డ్ పోటీలలో ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది.

# ఇకపై శ్రీలీల కాదు.. డా.శ్రీలీల



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో అందం, అభినయంతో తన కంటూ తక్కువ సమయంలోనే ఎక్కువ గుర్తింపు సంపాదించుకున్న యంగ్ అండ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల మరో రేర్ ఫీట్ సాధించారు. సినిమా కెరీర్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ఈక్వల్ ఇంపార్టెన్స్ ఇస్తూ ఆమె మెడికల్ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేశారు. తాజాగా ఆమె ఎంబీబీఎస్ కోర్సు విజయవంతంగా కంప్లీట్ చేసి అఫిషియల్‌గా డాక్టర్‌గా మారారు. ఈ మేరకు రీసెంట్‌గా నిన్న జరిగిన కాన్వకేషన్ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సాధారణంగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన తర్వాత చాలా మంది నటీనటులు చదువును మధ్యలో ఆపేస్తుంటారు! కానీ శ్రీలీల మాత్రం అలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఒకవైపు షూటింగ్స్, మరోవైపు పరీక్షలు, క్లినికల్ ట్రైనింగ్‌లను ప్యారలల్‌గా చేస్తూ చదువు పూర్తి చేశారు. ఎంతో హార్డ్‌గా ఉండే మెడికల్ కోర్సు పూర్తి చేయడం చిన్న విషయం కాదని, ఆమె పట్టుదలకు ఇది నిదర్శనమని ఇప్పుడు అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. శ్రీలీల చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేదని, డాక్టర్ కావాలనే టార్గెట్‌తో మెడిసిన్ కోర్సులో జాయిన్ అయిందని ఇప్పటికే పలుమార్లు కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే సినిమాల్లో అవకాశాలు రావడం.. ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. అయినప్పటికీ చదువును వదలకుండా రెండింటినీ సరైన విధంగా నిర్వహించడం ఆమె స్పెషాలిటీగా నిలిచింది. ఇటీవల కాలంలో వరుస సినిమాలతో బిజీగా ఉన్న ప్పటికీ, ఆమె పరీక్షల సమయంలో షూటింగ్స్ కు బ్రేక్ ఇచ్చి చదువుపై దృష్టి పెట్టిందని సమాచారం. ఇప్పుడు ఎంబీబీఎస్ కంప్లీట్ చేయడంతో అభిమానులు, సినీ ప్రముఖులు, ఫ్రెండ్స్ సోషల్ మీడియాలో విషెస్ తెలియజేస్తున్నారు. బ్యూటీ విత్ బ్రెయిన్, డాక్టర్ శ్రీలీల అంటూ ప్రశంసలు వర్షం కురిపిస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా సక్సెస్ సాధించడంతో పాటు మెడికల్ డిగ్రీ పొందడం యూత్‌కు ఆమె ఇన్స్పిరేషన్ అని పలువురు అభిప్రాయపడుతున్నారు. టార్గెట్ సరిగ్గా ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఆమె నిరూపించిందని చెబుతున్నారు. ముఖ్యంగా చదువుతో పాటు ఇతర రంగాల్లో కెరీర్ కొనసాగించాలనుకుంటే విద్యార్థులకు శ్రీలీల ప్రయాణం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పాలి. ప్రస్తుతం ఆమె చేతిలో పలు తెలుగుతోపాటు హిందీ సినిమాలు కూడా ఉన్నాయి. అయితే ఇకపై మూవీలతో పాటు వైద్య సేవలపైనా ఆమె ఫోకస్ పెడుతుందా అనే విషయంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఏదేమైనా హీరోయిన్‌గా మాత్రమే కాకుండా డాక్టర్‌గానూ కొత్త గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీకి అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీవో ముందుంటుంది

## - టీజీవో డైరీ-2026 ఆవిష్కరణ కార్యక్రమంలో టీజీవో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు


**భద్రాచలం, (రాజధాని వార్తలు):** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టి జి ఓ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డైరీ--2026 ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి భద్రాచలం హరిత హోటల్‌లో జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముందుగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అతిథులు, ఆహ్వానితులను ఆకట్టుకుంది. వారి ప్రతిభను అభినందిస్తూ ముఖ్య అతిథి చిన్నారులకు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి ప్రశంసించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ సమర్థవంతమైన పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని విభాగాల గెజిటెడ్ అధికారులు తమ వృత్తిపరమైన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ, టీజీవో అసోసియేషన్‌కు బలమైన వెన్నుదన్నుగా నిలుస్తున్నారని అన్నారు. అలాగే అసోసియేషన్‌ను మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు జిల్లా కార్యవర్గం చురుకైన పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు, టీజీఈజేఏసీ సెక్ర



టరీ జనరల్, డైనమిక్ లీడర్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తున్నదని తెలిపారు. మెడికల్ బిల్స్, సప్లిమెంటరీ బిల్స్‌ను పెండింగ్ లేకుండా క్లియర్ చేస్తున్నదని, అలాగే సరెండర్ లీవ్స్, గ్రాట్యుటీ, పెన్షనర్స్ బెనిఫిట్స్ వంటి అంశాలను ప్రస్తుతం నెలకు విడుదల చేస్తున్న రూ.750 కోట్లను రూ.1500 కోట్లకు పెంచి వీలైనంత త్వరగా పూర్తిగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీజీఈజేఏసీ ద్వారా డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగుల హెల్త్ కార్డు అమలుపై ప్రభుత్వం అతి త్వరలో నిర్ణయం తీసుకోనున్నదని, అలాగే పీఆర్‌సీ అమలు కోసం కూడా తీవ్రంగా కృషి జరుగుతున్నదని తెలిపారు. డిపార్ట్మెంట్ వారిగా ఉన్న సమస్యల్లో ఇప్పటికే అనేక వాటిని పరిష్కరించినట్లు, ముఖ్యంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీలను నిర్వహించి అనేక విభాగాల్లో ప్రమోషన్లు సాధించామని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో కొంత జాప్యం జరిగిందని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మిగిలిన సమస్యలను టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గెజిటెడ్ అధికారుల కోసం ప్రత్యేక కార్యాలయ భవనం, భద్రాచలంలో దేవస్థానానికి విచ్చేసే అధికారుల సౌకర్యార్థం గెస్ట్ హౌస్ ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీరామనవమి, ముక్కోటి వంటి ముఖ్యమైన సందర్భాలలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే అధికారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ దిశగా జిల్లా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. అనంతరం టీజీవో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మరియు ఇతర అతిథుల చేతుల మీదుగా టీజీవో డైరీ-2026ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.మహేష్ కార్యదర్శి నివేదికను వినిపించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి, అసోసియేట్ అధ్యక్షులు బి.దస్రు, కోశాధికారి జె. తిరుపతి, ఖమ్మం టీజీవో నాయకులు రాంబాబు, డా.విజయ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా అధ్యక్షురాలు బి. సులోచన రాణి, కన్వీనర్ ఎం. రాణి, సెంట్రల్ అసోసియేషన్ మహిళా విభాగం అసోసియేట్ సెక్రటరీ పి.నీరజ, కార్యవర్గ సభ్యులు శేష ప్రసాద్, జిల్లా అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్ కె. జమలా రెడ్డి, ఆర్. రాజి రెడ్డి, ఎన్. తిరుమలేష్, ధనియాల వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, బండి వెంకటేశ్వర్లు, కే.ఎస్.ఎన్. మూర్తి, లక్ష్మణ్ రావు, నందికొండ వెంకన్న, నరేందర్, వై. సురేందర్ రెడ్డి, నాగరాజు, రమేష్, ఎన్.కనకదుర్గ, పోలవరపు పద్మ, గుప్త, రాజు, డా.ఆనందరావు, దినేష్ కుమార్, తార, పోచాలరావు, గరుడాచలం తదితరులు, వివిధ డిపార్ట్మెంట్ల ఫోరం అధ్యక్షులు, కార్యదర్శులు, గెజిటెడ్ అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీశ్రీ శంబర పోలమాంబ ఆలయానికి మూడో వారం కూడా తగ్గని జనం






**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం శంబర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి ఆలయానికి మూడవ వారం కూడా భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గలేదు. ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలవడం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిన తిరుపతి ఆలయ ఈవో బి శ్రీనివాసరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అలాగే యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు సిఐ రామకృష్ణ మక్కువ ఎస్ఐ వెంకటరమణ 200 మంది సిబ్బందితో పర్యవేక్షించారు. భక్తులకు లడ్డూ ప్రసాదం 15000 అందుబాటులో ఉంచారు. సుమారు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారుల అంచనా అమ్మవారి యాత్ర మరో ఏడు వారాలు కొనసాగుతుంది అని ఆలయ ఈవో శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలియజేశారు. శ్రీ శంబర అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు.

# గ్రాన్యూల్స్ ఫార్మాలో ఉద్యోగం సాధించిన సత్య కళాశాల విద్యార్థికి అభినందనలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి మిస్టర్ ఎం.రాంబాబు గ్రాన్యూల్స్ ఫార్మా లిమిటెడ్ సంస్థలో ఎఫ్.డి.ప్రొడక్షన్ విభాగంలో Self Directed Team గా ఉద్యోగం సాధించడం గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ, విద్యార్థి కృషి, క్రమశిక్షణ మరియు నిరంతర అభ్యాసమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు కళాశాల దశ నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవమణి మాట్లాడుతూ, విద్యార్థి సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్




కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి.సూరప నాయుడు హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : పిలుపునిచ్చిన వామపక్ష నాయకులు




**గూడూరు, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా ఈనెల 12న జరగనున్న సమ్మెను విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం గూడూరులోని సి.ఐ.టి.యు కార్యాల యంలో వామపక్ష పార్టీల నాయకులు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన ఈ సమ్మెలో అన్ని సంఘాల నాయకులు, కార్మికులు, ప్రజలు, పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. అనంతరం సి.ఐ.టి.యు, అంగన్వాడి, మున్సిపల్, ఏ.ఐ.టి.యు.సి, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సమ్మె కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి.శివకుమార్, సి.పి.ఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి.కుమార్‌లు ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు పామంజి, మణి, మున్సిపల్ సంఘశీ నాయకులు ధారా కోటేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు ఏంబేటి చంద్రయ్య, ఏ.ఐ.టి.యు.సి. అధ్యక్ష,కార్యదర్శులు సి.వి.ఆర్. కుమార్, కె.నారాయణ, సిఐటియు భవన నిర్మాణ సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, ఎస్.కె.జిలాని, అంగన్‌వాడి అధ్యక్ష, కార్యదర్శులు ఏ.ఇంద్రావతి, బి.ఎస్.ప్రభావతి, సెక్టార్ లీడర్ పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతి : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని కొత్త బగ్గాము గ్రామానికి చెందిన బగ్గం శ్యామల (75) వైఫ్ ఆఫ్ సత్యనారాయణ అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించినట్లు ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. స్థానిక ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాల ప్రకారం 25-01-2026వ తేదీన బగ్గం శ్యామల అనే వృద్ధురాలు ఉదయం 10 గంటల సమయంలో తన ఇంటి వరండాలో ఉన్న తులసి చెట్టు వద్ద దీపం వెలిగించి, తులసి మొక్క చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆమె చీర యొక్క పైట అంచు భాగానికి దీపం అంటుకొని శరీర భాగాలు కాలడం జరిగిందని ఎస్సై తెలిపారు. కాలిన గాయాలతో ఉన్న వృద్ధురాలని చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్న సమయంలో ఆమె చికిత్స పొందుతూ ఈరోజు(10-02-2026) వ తేదీన చనిపోయినట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. చనిపోయిన వృద్ధురాలి కుమారుడు బగ్గం పూర్ణచంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు.

# వైభవంగా శ్రీరామచంద్రమ్మ తల్లి అమ్మవారి పండుగ మహోత్సవం



## - నూతన వస్త్రాల సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన గంట్ల దంపతులు

**విశాఖ / పరవాడ, (రాజధాని వార్తలు):** వాడచీపురుపల్లి పరవాడ మండలం దళాయపాలెం పరిసర 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం శ్రీ రామచంద్రమ్మ తల్లి అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొల్పి ఆరాధన గావించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ రామచంద్రమ్మ తల్లి అమ్మవారిని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రార్థించుకున్నారు. లోకంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు గంట్ల శ్రీనుబాబు చెప్పారు.

# 29వ వార్డు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ సౌత్ జోన్ కార్యాలయంలో గల మొదటి అంతస్తులో ఉన్న విజన్ యూనిట్ ప్లాన్ కార్యాలయంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ 29వ వార్డు వాస్తవ్యులు జంపా సుశీల మరియు పైడితల్లికి సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అంగటి శ్రావణ కుమార్ మరియు మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నిధులు మంజూరు చేసినందుకు ఆర్థికంగా సహాయం చేసినందుకు ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# జాయింట్ ఎల్.పి.ఎంలను తొలగించాలి

## - జాయింట్ ఎల్.పి.ఎంలను సుమోటోగానే పరిష్కరించాలి : జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్






**ఎస్.కోట (విజయనగరం), (రాజధాని వార్తలు):** జాయింట్ ఎల్పీ ఎంలను తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. ఆయన మంగళవారం ఎస్.కోట మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జేసి సందర్శించి, పట్టాదారు పాసుపుస్తకాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను పరిశీలించి, ముఖ్యంగా భూ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ క్లినిక్ కు వచ్చిన అర్జీలపై ఆరా తీశారు.

జాయింట్ ఎల్పీఎంలను సుమోటోగానే పరిష్కరించాలని ఆదేశించారు. మ్యుటేషన్ల విషయంలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలకు రూపొందించి పంపిణీ చేయాలని ఆదేశించారు. పర్యటనలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఇతర రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గృహనిర్మాణాన్ని వేగవంతం చెయ్యండి : జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గృహ నిర్మాణ ప్రగతిపై ఆయన కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రగతిని పరిశీలించారు. ఈ రెండు వారాల్లో గ్రామీణ ప్రాంతంలో సుమారు 1374, పట్టణ ప్రాంతాల్లో 650 ఇల్లు స్టేజ్ కన్వర్షన్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికి, పెద్దగా ప్రగతి కనిపించలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీనిపై మండల ప్రత్యేకాధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా లబ్ధిదారులను చైతన్య పరిచి, వారు గృహ నిర్మాణానికి ముందుకు వచ్చేటట్టు చేయాలని సూచించారు. అప్పుడు మాత్రమే లక్ష్యాలను సాధించగలరని స్పష్టం చేశారు. కొన్ని సచివాలయాల పరిధిలో సున్నా ప్రగతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కార్యదర్శులు దీనికి బాధ్యత వహించాలని, నిర్మాణాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, గృహ నిర్మాణ ఏఈలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లతో ప్రత్యేక మాట్లాడి, ప్రగతి ముందుకు నడిచేలా చూడాలని కోరారు. ప్రధానంగా స్టేజ్ కన్వర్షన్ పై దృష్టి పెట్టాలని, తద్వారా నిర్మాణం ముందుకు సాగుతుందని చెప్పారు. సచివాలయం పరిధిలో వారానికి కనీసం రెండు ఇల్లు అయినా స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూసి, ఇల్లు పూర్తి చేసేందుకు కృషి చేయాలనీ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి గృహనిర్మాణ శాఖ పిడి మురళీమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

## - విద్యార్థుల ఆహారం, ప్రజల నిత్యావసర సరుకుల సరఫరాలో అలసత్వం వద్దు







**అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రజల ఆహార భద్రత, గురుకుల, పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పోషకాహార సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణ కిరణ్ స్పష్టం చేశారు. వెంకటకృష్ణపురం అంగన్వాడి, కూనవరం ఎంపీపీ స్కూల్, ఎఫ్‌పి నెంబర్ 30, శివకోడు గురుకుల వసతి పాఠశాల, పి గన్నవరం ఎంఎల్ఎస్ పాయింట్, బండారులంక ఎఫ్పి షాపు 14, గురుకుల బాలికల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సరఫరా అంశాలను పరిశీలించి అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలు, హాజరు పట్టికలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార వివరాలను, రికార్డులను ఆయన పరిశీలించి సిబ్బందికి నిర్వహణ తీరు పట్ల పలు సూచనలు చేశారు. కొన్ని కేంద్రాలలో మౌలిక వసతుల లోపాలను గుర్తించి, సంబంధిత అధికారులకు తక్షణమే సరిదిద్దేలా ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, మెనూ అమలు, సరుకుల నిల్వలు, వంటశాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి, పరిమాణంపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. లోపాలు ఉన్నచోట హెచ్చరికలు జారీ చేసి, నాణ్యత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని స్పష్టం చేశారు. చౌకధరల దుకాణాల్లో బియ్యం, చక్కెర, పప్పులు తదితర నిత్యావసర వస్తువుల నిల్వలు, తూకం సరైన విధంగా ఉన్నాయా లేదా కోణంలో తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సరుకులు పూర్తిస్థాయిలో అందుతున్నాయా అనే విషయంపై విచారణ చేశారు. అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కృష్ణకిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, నాణ్యంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉండవలసిన స్టాక్‌లో కొరత, రికార్డు తేడాలు, నాణ్యత లేని బియ్యం సరఫరా సాధారణ లోపాలు, స్టాక్ రికార్డుల్లో తేడాలు గుర్తించడం జరిగిందన్నారు. అదేవిధంగా స్టాక్ బోర్డు లేకపోవడం, బియ్యం పంపిణీ అవకతవకలు, సకాలంలో షాపులు తెరవకపోవడం నిత్యావసర వస్తువులు తక్కువ పరిమాణంలో ఇవ్వడం వంటి అంశాలలో అధికారులు డీలర్లపై తగుచర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పౌరసర ఫరాల జిల్లా మేనేజర్ శ్రీనివాస్, ఏఎస్ఓ శరత్, సంక్షేమ శాఖల అధికారులు, తూనికలు కొలతలు ఆహార కల్తీ నియంత్రణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతను ఉపయోగిస్తూ అప్రమత్తంగా ఉండాలి

## - కుటుంబ సభ్యులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి- సురక్షిత అంతర్జాల దినం కార్యశాలలో జిల్లా రెవిన్యూ అధికారి మురళి - జిల్లా ఎన్.ఐ.సి (జాయింట్ డైరెక్టర్, ఐ.టి) అధికారి ఆకెళ్ళ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సురక్షిత ఇంటర్నెట్ వినియోగం/ భద్రత గురించి, ఫోన్లు విస్తృత వినియోగం వలన కలిగే నష్టాలు గురించి వివరించారు






**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ ఆధునిక పరికరాలు ఇంటర్‌నెట్ అనుసంధానంతో విరివిగా ఉపయోగిస్తున్నారని అందువలన ఇంటర్నెట్ ద్వారా మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని జిల్లా రెవిన్యూ అధికారి మురళి అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో ఎన్.ఐ.సి ఆధ్వర్యంలో జరిగిన సురక్షిత అంతర్జాలం దినం కార్యశాలలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం వలన ఆధునిక మొబైల్ ఫోన్లు అందరికీ అందుబాటులో ఉన్నాయని అవి అవసరం మేరకే వినియోగించాలని అన్నారు. అంతర్జాలం ద్వారా ఆన్లైన్ మోసాలకు గురికాకుండా ఉండాలంటే మొబైల్ ఫోన్లు, డెస్క్ టాప్, లాప్ టాప్‌లకు రెండు అంచల భద్రత ఏర్పాటు చేసుకోవాలని ఎప్పటికప్పుడు పాస్‌వర్డులు మార్చుకోవాలని సూచించారు.

పరిచయం లేని వ్యక్తులనుండి సంక్షిప్త సందేశాలు, వీడియో కాల్, లింకుల రూపం లో వస్తే సమాధానం ఇవ్వరాదని అన్నారు. వ్యక్తిగత సమాచారం దోపిడీ చేయుటకోసం ఆన్లైన్ ద్వారా మాల్‌వేర్/ స్పై వేర్ ద్వారా కంప్యూటర్, మొబైల్ ఫోన్ లలో ఉన్న సమాచారం తస్కరించేందుకు అవకాశం ఉన్నందున అనవసరమైన అప్లికేషన్స్ ఉపయోగించరాదని సూచించారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ఆన్లైన్/సైబర్ మోసాల గురించి కుటుంబ సభ్యులకు కూడా వివరించాలని అన్నారు. ఈ కార్యశాలలో జిల్లా ఎన్.ఐ.సి (జాయింట్ డైరెక్టర్, ఐ.టి) అధికారి ఆకెళ్ళ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సురక్షిత ఇంటర్నెట్ వినియోగం/ భద్రత, ఓటిపి నేరాలు, నకిలీ వెబ్సైట్స్, ఎ ఐ ఆధారిత నేరాలు, మొబైల్ ఫోన్లు విస్తృత వినియోగం వలన కలిగే నష్టాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున రావు, కలెక్టర్ కార్యాలయం అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# వుడా బ్రాంచ్‌లో ఘనంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విఎంఆర్డిఏ కార్యాలయంలో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 90వ వ్యవ స్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విఎంఆర్డిఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ పాల్గొన్ని జ్యోతి ప్రజ్వలన చేసారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 90 వ్యవస్థపాక దినోత్సవం పురస్కరించుకొని కేక్ కటింగ్ చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ దేశ బ్యాంకింగ్ రంగంలో ఐఓబికు ఉన్న చరిత్ర, సేవలు ఆదర్శ ప్రాయమైనవి కొనియాడారు. విశాఖపట్నం వుడా బ్రాంచ్‌లో వ్యవస్థాపక దినోత్సవాన్ని జరపటం ఆనందకరంగా ఉందన్నారు. ప్రజల విశ్వాసమే ఐఓబి యొక్క అసలైన బలమని పేర్కొన్నారు. బ్యాంకింగ్ సేవలతో పాటు, సామాజిక బాధ్యతలో ఐఓబి ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. అనంతరం బ్యాంకు ఆవరణలో నిర్వహించిన ఉచిత దంత మరియు కళ్ళ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్డిఎ జాయింట్ కమీషనర్ కె.రమేష్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వై. హరి ప్రసాద్, రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం : నురుకుర్తి వెంకటేశ్వరరావు

## - కరపలో టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ





**కరప, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరి పాలన సాగుతుందని మాజీ జెడ్పిటిసి నురుకుర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కరప మండలంలో మంగళవారం ఇటీవల టిడిపి సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలు, అభిమానుల ఇళ్లకు కాకినాడ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దేవు వెంకటేశ్వరరావు (వెంకన్న) ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి నురుకుర్తి వెంకటేశ్వరరావు స్వయంగా వెళ్లి టిడిపి సభ్యత్వం కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నురుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడు తూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డు కేవలం ఒక కార్డు మాత్రమే కాదు అది పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాల పట్ల మన నిబద్ధతకు ప్రతీక అని తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, సభ్యత్వ కార్డు పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలకు నిబద్ధత నిదర్శనమని గుర్తు చేశారు. గ్రామీణ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు సానా సతీష్ నేతృత్వంలో ప్రతి శుక్రవారం కాకినాడ సతీష్ బాబు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నా మని తెలిపారు. ప్రజల సమస్యలు, అవసరాలు, సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తా మని, టిడిపి ప్రభుత్వం ప్రజల అండగా ఉంటుందని అన్నారు. గ్రామాల్లో సభ్యత్వ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని, పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్రగడ రాజకుమార్, మేడిశెట్టి శేషగిరి, సింగనీడి సత్యనారాయణ, నున్న రాంబాబు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# బ్యాంకు ఖాతాలన్నీ వాడుకలో ఉండేలా చర్యలు తీసుకోండి : కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలోని ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలన్నీ వాడుకలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వశాఖల కార్యాలయాల్లో వాడుకలో లేని బ్యాంకు ఖాతాల వివరాలు, నగదు నిల్వల సమాచారాన్ని ఎల్‌డిఎం మణి శేఖర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శాఖల వారీగా ఇన్‌యాక్టివ్‌గా ఉన్న అకౌంట్ల వివరాలపై సమీక్షించారు. వెం టనే సంబంధిత శాఖ హెచ్‌వోడి రిక్వెస్ట్ లెటర్, ఆధార్, సిటిసి, ఐడి కార్డుతో ఆయా బ్యాంకుల్లో సంప్రదించి ఇన్‌యాక్టివ్ ఖాతాలను వాడుకలోనికి తీసుకు రావాలని సూచించారు. ఖాతాల అవసరం లేకుంటే ఖాతాలను క్లోజ్ చేయాలన్నారు. డివిజన్, మండలస్థాయి అధికారులు ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వశాఖల బ్యాంకు ఖాతాలపై సమీక్షించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో విజయ్‌కుమార్, వివిధశాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# తొలి తిరుపతి హుండీల ఆదాయం రూ. 32 లక్షలు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తొలి తిరుపతిగా పిలువబడే పెద్దాపురం మండలం చదలాడ తిరుపతి శ్రీ శృంగారవల్లభ స్వామి ఆలయ 97 రోజుల హుండీలు, అన్నదాన ట్రస్ట్ ఆధాయం రూ. 32,00,025లు వచ్చింది. ఈ మేరకు మంగళ వారం ఆలయంలో స్వామివారి ఆదాయ లెక్కింపు కార్యక్రమం డివిజన్ తనిఖీ అధికారి వి ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గడచిన 97 రోజులకు గానూ హుండీల ఆదాయంగా రూ. 25,19,389, అన్నదానం హుండీ ద్వారా రూ. 6,80,636 వెరసి రూ. 32,00,025 ఆధాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహనాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఆధాయ లెక్కింపు కార్యక్రమంలో పెద్దాపురం గ్రూప్ టెంపుల్స్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.జగదేశ్వరరావు, ధర్మకర్తలు మండలి చైర్మన్ మొయిళ్ళ సంధ్య కృష్ణ మూర్తి, ధర్మకర్తలు వంక మహేష్, జట్ల రాంబాబు, లక్కరాజు



రామకృష్ణ, తిరుపతి గ్రామసర్పంచి మెయిళ్ల కృష్ణమూర్తి గ్రామస్తులు, తుని, అనపర్తి గ్రామాల శ్రీవారి సేవకులు, దేవ స్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్త మాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, కాంద్రకోట ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది హరిబాబు, నాని తదితరులు పాల్గొని సేవలనందించారు.

# 100 శాతం అక్షరాస్యత లక్ష్యం : ఉల్లాష్ అక్షరాంధ్రలో పిడి కనకరాజు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సమాజంలో నూరు శాతం అక్షరాస్యత లక్ష్యం అయినందున దానిని సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కనకరాజు పిలుపునిచ్చారు. సామర్లకోట పురపాలక సంఘం మెప్మా విభాగములో "ఉల్లాస్ అక్షరాంధ్ర" సమావేశం మంగళవారం జరిగినది. దీనిలో కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరక్టరు టి కనక రాజు ముఖ్య అతిధిగా విచ్చేసి పాల్గొన్నారు. అక్షరాంధ్ర ద్వారా ముఖ్యమంత్రి ప్రతిపాదించినట్లు ప్రతి కుటుంబంలో అందరూ 100 శాతం అక్షరాశ్యతను సాదించాలని, ప్రతి ఒక్కరు చదవడం, వ్రాయడం నేర్చుకోవాలని సూచించారు. సంఘ సభ్యులు, వాళ్ళ పిల్లలను వాలంటీర్స్‌గా నియమించి వారి ద్వారా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ టీచర్లకు పెన్స్, పెన్సిల్స్ అందచేశారు. ఈ సమావేశంలో జిల్లా ఐబి పి.రవి శంకర్, సిఎంఎం సయ్యద్ హుస్సేన్, సిఓలు, ఆర్పిలు హాజరయ్యారు.

# ఇంద్రపాలెం గ్రామపంచాయతీ కార్మికుల ఐదు నెలల బకాయి జీతాలకై ర్యాలీ - కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కలెక్టర్ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న ఇంద్రపాలెం గ్రామపంచాయతీ కార్మికులకు సెప్టెంబర్ నెల నుంచి జనవరి వరకు గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడాన్నీ నిరసిస్తూ ఏపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ముసలమ్మ తల్లి నుండి ప్రదర్శన అనంతరం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల కార్యదర్శి చింతపల్లి అజయ్ కుమార్ మాట్లా డుతూ పారిశుధ్య నిర్వహణలో, ప్రజల ఆరోగ్యాల పరిరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికులకు ఇంద్రపాలెంలో ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. అప్పులతో, ఆకలితో కార్మికులు ఎలా పనిచేయాలి? అని అధికారులను ప్రశ్నించారు. తూరంగి, వలస పాకల, రమణయ్యపేట ఒక నెల జీతం బకాయిలు ఉన్నాయి. ఇదే పరిస్థితి రూరల్‌లో అనేక పంచాయతీల్లో జీతాలు బకాయిలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 9 విలీన గ్రామాల్లో పాలకవర్గాలు లేక, ప్రభుత్వ గ్రాంట్లు రాక గ్రామాల అభివృద్ధికి, కార్మికుల జీతాలకు నిధులు లేవన్నారు. పరిశ్రమల నుండి ఇంద్రపాలెం పంచాయతీకి రావలసిన పన్నులు ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా 52 లక్ష రూపాయలు, నీరజ్ మెరైన్ 21 లక్ష రూపాయలు పన్ను బకాయిలు ఉన్నాయని తెలియజేశారు. ఇంద్రపాలెం పంచాయతీకి పరిశ్రమల నుండి రావలసిన మొత్తం 76 లక్షల రూపాయలు అధికారులు వెంటనే వసూళ్ళు చేసి కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే 2026-27 బడ్జెట్ కేటాయింపుల్లో విలీన గ్రామాల అభివృద్ధికి, కార్మికుల సంక్షే మానికి రెండు వందల కోట్ల రూపాయలు ప్రత్యే కంగా నిధులు కేటాయించాలని దీనికి కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ప్రత్యేక దృష్టిసారించి నిధులు రాబట్టాలని అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సిఐటియు కాకినాడ రూరల్ కార్యదర్శి తొట్టిపూడి రాజా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ సకాలంలో జీతాలు, పి ఎఫ్, ఈ ఎస్ ఐలు అమలు చేయాలని, పంచా యతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ లకు తగు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఇంద్రపాలెం సిపియం పార్టీ నాయకులు చిట్టూరి విజయకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సేవలకు విలువ కట్టలేమని, ఐదు నెలలుగా జీతాలు బకాయిలు పెట్టడం అన్యా యం అన్నారు. జీతాలు సాధించుకోవడం, ఇతర హక్కుల సాధన కోసం కార్మికులు చేసే పోరాటానికి సిపియం పార్టీ కార్మికులకు అండగా ఉంటుందని విజయ్ కుమార్ తెలియజేశారు. ఈ ధర్నాకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు, సంజయ్, సాహిత్, పంచాయతీ నాయకులు ఎం అప్పారావు కొవ్వాడ, పి సత్తిబాబు చీడిగ, దుర్గాప్రసాద్ తూరంగి పంచాయతీల నాయకులు ఈ ధర్నాకు తమ మద్దతు తెలిపారు. అనంతరం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ సగిలి సన్మోహన్‌కి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వాసంశెట్టి చంద్రరావు, పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు పెంకే వీరభద్రం, ఎం సత్యనారాయణ, ఎం రాజు, డి.శ్రీను, కె అప్పయ్యమ్మ, సత్యవతి, వాసంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విజయోత్సవ సభను విజయవంతం చేయండి

**అల్లవరం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం బాలయోగి ఘాట్‌నందు ఫిబ్రవరి 25వ తేదీన జరుగు మాది గల విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. అల్లవరం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు యార్లగడ్డ రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం విజయోత్సవ సభ కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేసారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జాతీయ, ఎంఎస్పి జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుమర్తి మోహన్, చాటల సత్యనారాయణ, నవ్వుంద్రి నాగరాజు, నామాడి నాగరాజు, పలివెల శ్రీరామ్, నవుంద్రి జానీ, పెద పూడి వెంకట్రావు, బొమ్మి ఆనందరావు, జొన్నాడ చిట్టిబాబు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan